ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి:01 సంచిక:81 ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు మంగళవారం, అక్టోబర్ 27,2026 పేజీలు:12 వెల:10రూ/-

హీరోయిన్లతో కేటీఆర్ దుబాయ్ వెళ్లారు

వెంకట్ బల్మూర్

హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ఎమ్మెల్సీ వెంకట్ బల్మూర్ తీవ్రమైన వ్యక్తిగత ఆరోపణలు చేశారు. కేటీఆర్ తన పేరును మార్చుకుని ఇద్దరు హీరోయిన్లతో కలిసి దుబాయ్ వెళ్లారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.'రామ్ కేటీ', 'కే రామ్' అనే పేర్లతో కేటీఆర్ ఇద్దరు హీరోయిన్లు, మరో ఇద్దరు ప్రముఖులతో కలిసి దుబాయ్‌కు వెళ్లారని ఆరోపించారు. ఎవరికీ దొరక్కుండా ఉండేందుకే హైదరాబాద్ నుంచి నేరుగా కాకుండా, బెంగళూరు, ఢిల్లీ మీదుగా ప్రయాణించారని పేర్కొన్నారు. తాను చెబుతున్నవి అబద్ధమైతే, తన కొడుకు మీద ఒట్టేసి చెప్పగలరా అని కేటీఆర్‌కు ఆయన సవాల్ విసిరారు.

'ఎల్‌నినో ప్రమాదాన్ని కాంగ్రెస్ పట్టించుకోలేదు'



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్: ఎల్‌నినో పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తన చేతకానితనాన్ని ప్రకృతిపై నెట్టే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు మండిపడ్డారు. గత ఆరు నుంచి తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ముప్పు ఉందని తెలుస్తున్నప్పటికీ, ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గోదావరి, కృష్ణా జలాల నుంచి నీటిని ఎందుకు లిఫ్ట్ చేయలేదని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, తాగు – సాగు నీటి లభ్యతపై శ్వేతపత్రం విడుదల

నెల్లూరును దేశంలోనే నంబర్ 1 నగరంగా తీర్చిదిద్దుతాం

మంత్రి నారాయణ

అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం

- బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను
- రేపటికి అతి తీవ్ర తుపానుగా మారనున్న వైనం
- అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం



- ఏపీ, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్ జారీ
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం

మిగతాది 2లో

గత ఐదేళ్ల పాలనను చూసి ప్రజలు 11 సీట్లకే పరిమితం

- స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ అల్లర్లకు పాల్పడుతోందన్న మంత్రి అనగాని



అమరావతి, ట్రైనెట్ న్యూస్:స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడుతోందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల మద్దతు పొందలేకే జగన్ హింసా రాజకీయాలను ఎంచుకున్నారని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.పుంగనూరు, తిరుపతి, రాయచోటి, పులివెందుల, కడప, దర్శి, కనిగిరి వంటి ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు చేసిన దాడులే ఇందుకు నిదర్శనమని అనగాని పేర్కొన్నారు. ఎన్నికలు ఏవైనా హింసను ప్రోత్సహించడమే జగన్ నైజమని, గత ఐదేళ్ల పాలనను చూసి ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఆయన తీరులో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. కుట్రలు, దాడులు, విధ్వంసాలతో ప్రజల ఓట్లు సాధించలేరనే వాస్తవాన్ని జగన్ గుర్తించాలని హితవు పలికారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని మంత్రి తెలిపారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఛాంపియన్ కూటమి విజయ దుందుభి మోగిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. "స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూసైనా గొడ్డలి పార్టీ నాయకులకు, జగన్ రెడ్డికి బుద్ధి రావాలి.

పంటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కోస్తాంధ్రలోని 11 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలకు అవకాశం

- అర్ణబ్ తుపాను: రేపు, ఎల్లుండి అతి భారీ వర్షాలు..
- గంట గంటకూ పరిస్థితి సమీక్షిస్తోన్న చంద్రబాబు
- బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను
- యానాం వద్ద ఈ నెల 28న తీరం దాటనున్న తుపాను



- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

అమరావతి, ట్రైనెట్ న్యూస్: బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గంట గంటకూ

మిగతాది 2లో

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..



- కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!
- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర

మిగతాది 2లో

ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం

- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- విజయవాడలో ఎన్టీఆర్ వర్సిటీ 40వ వార్షికోత్సవం
- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడిన ఉపరాష్ట్రపతి



ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్: భవిష్యత్తులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్సిటీ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు అందించిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించిన ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు.ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కొత్త పరిష్కారాలు కనుగొనేందుకు వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో రాణించాలని సూచించారు.వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, వైద్యులు మానవత్వాన్ని ఎన్నడూ మరువరాదని ఆయన హితవు పలికారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం, ఆత్మీయత చూపడమే వైద్య వృత్తిలో అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దాని దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్యులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

మిగతాది 2లో

8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం



- ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు త్వరలో జమ
- లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్న మంత్రి పొంగులేటి
- రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- తరువాతి విడతల్లోనూ అర్హులకు ఇళ్ల కేటాయింపు

మిగతాది 2లో



కల నెరవేరే దిశగా కీలక ముందడుగు

- తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం!
- 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- అధ్యయనానికి అధికారుల కమిటీ ప్రతిపాదన
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ

ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్ తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ఎత్తు పెంపుతో మహారాష్ట్రకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని స్పష్టం చేస్తూనే.. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అయితే, బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉందని అన్నారు. ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథిగృహంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఫడ్నవీస్‌తో సోమవారం సమావేశమైంది. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు.

మిగతాది 2లో

నెల్లూరును దేశంలోనే నంబర్ 1 నగరంగా తీర్చిదిద్దుతాం

మొదటి పేజీ తరువాయి

| నగరాన్ని దోమల్లేని నగరంగా మార్చడమే లక్ష్యమని వెల్లడి

| గత ప్రభుత్వం 5 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శ

అమరావతి, ట్రైనెట్ న్యూస్:నెల్లూరు నగరాన్ని దేశంలోనే నంబర్ వన్ నగరంగా తీర్చిదిద్దుతామని, అందుకు అనుగుణంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. 2027 జూన్ 12 నాటికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేసి, నెల్లూరును దోమల్లేని నగరంగా మారుస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నివాసంలో జరిగిన కూటమి పార్టీల ముఖ్య నేతల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 5 శాతం పనులు మిగిలి ఉన్నా అండర్‌గ్రౌండ్ పనులు పూర్తి చేయలేదని నారాయణ విమర్శించారు. ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి పనులకు వెంటనే నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధికి, ఇప్పటి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పనులకు తేడాను గమనించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... మంత్రి నారాయణ నగరాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నారని, ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు.

అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం

మొదటి పేజీ తరువాయి

| రైతులు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన

| అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలన్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, ట్రైనెట్ న్యూస్:బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు 'అర్ణబ్' అని నామకరణం చేశారు. 'అర్ణబ్' తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ (xవీణ), విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.

తీరం దాటేది అప్పుడే.. రెడ్ అలర్ట్ జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా మారి వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అక్టోబర్ 26, సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మరుసటి రోజు అక్టోబర్ 27న అతి తీవ్ర తుపానుగా మారనుందని తెలిపారు. అక్టోబర్ 28, బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం

ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణరక్షణకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ అత్యవసర మందులు, తాగునీరు, ఆహార పొట్లాలు, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బలహీనమైన భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులకు దూరంగా ఉండాలని, వర్షాలు, పిడుగుల సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశించారు.

రైతన్నలకు ప్రత్యేక సూచనలు

రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను వాతావరణం అనుకూలించగానే కోసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..

మొదటి పేజీ తరువాయి

| అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన

| నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ

| ఎస్ఐఆర్‌పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

అమరావతి, ట్రైనెట్ న్యూస్:ఓటర్ల పేర్ల తొలగింపుపై రేవంత్‌రెడ్డికి బీజేపీ నేత సవాల్‌తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు.నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

కల నెరవేరే దిశగా కీలక ముందడుగు



మొదటి పేజీ తరువాయి

గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యారేజీ ఎత్తు 148 మీటర్లుగా ఉంది. అయితే, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్లకు పెంచాలని కోరుతోంది.

అధ్యయనానికి అధికారుల కమిటీ

బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం కూడా తన పరిధిలో సాంకేతిక అంశాలను పరిశీలించనుంది.

రెండు లక్షల ఎకరాలకు సాగునీరు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. గిరిజన, అటవీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని రేవంత్‌రెడ్డి వివరించారు. బ్యారేజీ వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు అక్కడి నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు.
బ్యారేజీ ఎత్తు ఖరారైతే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గం రూపకల్పన, భూసేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. చర్చలు సానుకూలంగా సాగినా.. నిర్మాణానికి తుది అనుమతి లభించిందని ఇప్పుడే చెప్పలేం. అధికారుల అధ్యయనం, తదుపరి చర్చల తర్వాతే దీనిపై స్పష్టత రానుంది.

హైదరాబాద్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు

| రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో పురోగతి

| ఇంట్లో పనిచేసే యువతి సహా నలుగురు నేపాలీ నిందితుల అరెస్ట్

| దేశవ్యాప్తంగా, నేపాల్ సరిహద్దుల్లో ఐదు నెలలు గాలించి నిందితులను పట్టుకున్న సిట్

అమరావతి, ట్రైనెట్ న్యూస్:హైదరాబాద్ నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రే వినయ్ రంజన్ భార్య తనుజా రంజన్ హత్య కేసులో ఐదు నెలల తర్వాత కీలక పురోగతి లభించింది. ఈ దారుణానికి సూత్రధారిగా వ్యవహరించిన ఇంట్లోని పనిమనిషి ధర్మ అలియాస్ కల్పన సహా నలుగురు నేపాలీ నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో, భారత్–నేపాల్ సరిహద్దుల్లో ఐదు నెలల పాటు గాలించి నిందితులను కదలికలను గుర్తించారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం మీడియా సమావేశంలో ఈ అరెస్టుల వివరాలను వెల్లడించారు. నిందితులైన ధర్మ అలియాస్ కల్పన (26), గణేశ్ బి.కె (31), చంద్ర బహదూర్ ధమన్ (44), గణేశ్ బహదూర్ షాహి (37)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు.

పంటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి

పరిస్థితిని సమీక్షిస్తూ, రాష్ట్ర యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేస్తున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించడమే లక్ష్యంగా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా సమీక్షలు నిర్వహిస్తున్నారు. తుపాను గమనాన్ని, ప్రభుత్వ చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కీలక ఆదేశాలు జారీ చేస్తున్నారు.భారత వాతావరణ విభాగం హెచ్చరికల ప్రకారం, అర్ణబ్ తుపాను రేపటికల్లా తీవ్ర తుపానుగా బలపడి రాష్ట్రంపై ప్రభావం చూపనుంది. ఈ నెల 28వ తేదీన బాపట్ల–విశాఖ మధ్య యానాం వద్ద ఇది తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుపాను ప్రభావంతో రేపు మధ్యాహ్నం నుంచి ఉత్తర కోస్తాంధ్ర, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు,



సహాయక చర్యలు

తుఫాన్ నేపథ్యంలో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు (షెల్టర్లకు) తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, దివ్యాంగులు, బాలింతలు, చిన్నారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభావిత జిల్లాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సహాయక చర్యల కోసం రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 జిల్లాల్లో మోహరించాలని, అదనపు బలగాలను ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో రిజర్వ్‌లో ఉంచాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, నౌకాదళం, కోస్ట్‌గార్డ్ సేవలను కూడా వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

తుపాను వల్ల పంట నష్టం జరగకుండా చూడాలని, ఇప్పటికే కోత కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా రైతులకు సహకరించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారు. రాష్ట్రంలో సుమారు 1.82 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేందుకు సిబ్బందిని, సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నిత్యావసరాలు, రేషన్ సరకులు అందుబాటులో ఉంచాలన్నారు.తుపాను గమనాన్ని బట్టి ప్రతి నాలుగు గంటలకూ ప్రజలకు హెచ్చరికలతో కూడిన బులెటిన్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. గత తుపానుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. తుపాను తీవ్రతను బట్టి ప్రభావిత ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

మొదటి పేజీ తరువాయి




తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణం పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి త్వరలోనే ఆ మొత్తాన్ని జమ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు ఇంకా రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్రంలోని నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున, మొత్తం రూ.40 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు.మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని అర్హులైన పేదలు నిరాశ చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేస్తుందని, మూడు, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటనతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని, తుది చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. త్వరలోనే తమ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయన్న నమ్మకం వారిలో వ్యక్తమవుతోంది.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర సీఎం సానుకూల స్పందన

ముంబైలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం భేటీ

- తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లుగా నిర్ణయించాలన్న తెలంగాణ ప్రతిపాదనపై కీలక చర్చలు
- మహారాష్ట్రకు, తమ ప్రజలకు ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు సిద్ధమన్న ఫడ్నవీస్
- ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల చిరకాల సాగు, తాగునీటి ఆకాంక్షలను వివరించిన సీఎం రేవంత్ రెడ్డి
- గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు 152 మీటర్ల ఎత్తు ఎందుకు అవసరమో వివరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధం
- ఆదిలాబాద్‌లో రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి ఊతమని వివరించిన సీఎం
- రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటుకు మహారాష్ట్ర సీఎం ప్రతిపాదన
- బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై అధ్యయనం.. తదుపరి కార్యాచరణకు రోడ్ మ్యాప్



ముంబై, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై చర్చించారు.

సమావేశం ప్రారంభంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు.

ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్బి చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు.

2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ--మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని తెలిపారు. అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని వివరించారు. ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం (జఐజ) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు.

ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు.

ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు.

దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని తెలిపారు. హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానన్నారు.

ప్రజలపై బీఆర్ఎస్ పార్టీ నేతలకు ప్రేమలేదు

కరువు రావాలని బీఆర్ఎస్ కోరుకొంటుంది ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

రాజకీయం చేయాలనే ఆలోచనే తప్పా ప్రజలపై బీఆర్ఎస్ పార్టీ నేతలకు ప్రేమ లేదని భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ పార్టీ నేత చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో కరువు రావాలని ఆ పార్టీ నేతలు కోరుకుంటున్నారని విమర్శించారు. అందుకోసం అబద్ధాలను వారు ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిమాక్ లేని దివానా మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్త చేశారు.గడ్డం పెంచి పెద్ద మనిషి అయ్యానని ఆయన అనుకుంటున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. మేడిగడ్డలో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేదని పెదవి విరిచారు. ఎల్ నినో నేపథ్యంలో అక్టోబర్ 28వ తేదీన రాష్ట్రంలో నెలకొన్న



పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అందరి ఆలోచనల మేరకు నిర్ణయాం తీసుకుంటామని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్రైవింగ్ శిక్షణ దోహదం

మందమర్రిలో డ్రైవింగ్ ట్రాక్‌ను పరిశీలించిన మంత్రి వివేక్ వెంకటస్వామి



మందమర్రి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

మహిళలు డ్రైవింగ్ నైపుణ్యాలను పెంపొందించుకుని, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రిలోని సమ్మక్క సారలమ్మ మహిళా భవన్‌లో మహిళలకు డ్రైవింగ్ శిక్షణ అందించేందుకు ఎంఓడబ్ల్యూఓ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న డ్రైవింగ్ ట్రాక్‌ను ఆయన సందర్శించి, శిక్షణ కోసం చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు, ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. డ్రైవింగ్‌లో నైపుణ్యం సాధించడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు స్వతంత్రంగా జీవించేందుకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. మహిళలు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే కార్యక్రమాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మందమర్రిలో ఏర్పాటు చేస్తున్న ఈ డ్రైవింగ్ శిక్షణ సదుపాయం మహిళలకు నైపుణ్యాభివృద్ధితో పాటు స్వయం ఉపాధి సాధనలో తోడ్పడనుంది.

నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

10రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లుల చెల్లింపు

ఖమ్మం, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లిలో ఉన్న 3వ శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని, పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారంనేలకొండపల్లిలో పర్యాటక సదుపాయాల కల్పన, బౌద్ధ స్థల సంరక్షణ, పునరుద్ధరణ పనులకు మంత్రి శంకుస్థాపన వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 3 వ శతాబ్దానికి చెందిన బౌద్ధ స్థూపాన్ని సుమారు 50-55 సంవత్సరాల క్రితం నేలకొండపల్లి గ్రామంలో గుర్తించారని, దేశంలోనే అత్యంత పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిని ప్రారంభించినప్పటికీ పనులు పూర్తి చేయలేకపోయాయని అన్నారు. స్తూపం చుట్టూ ఉన్న ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో పురావస్తు శాఖ అధికారులు గతంలో జరిపిన తవ్వకాల్లో ఎన్నో పురాతన వస్తువులు లభ్యమయ్యాయని, వాటిని భద్రపరిచేందుకుస్థానికంగావసతులు లేకపోవడంతో హైదరాబాద్ మ్యూజియంలో ఉంచారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచవ్యాప్తంగా వచ్చిన బౌద్ధ మతస్థులు, స్థానికుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని, రాబోయే రోజుల్లో బౌద్ధ కట్టడాలపై అవగాహన ఉన్న ప్రముఖ నిపుణులను, అధికారులను ఇక్కడికి ఆహ్వానించి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు.తన పాలేరు నియోజకవర్గంలో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి



కార్యక్రమాలను ప్రారంభించడమేగాక వివిధ ప్రగతి పనులకు శంకుస్థాపనలు చేశారు.

10రోజుల్లో ఫైనల్ బిల్లుల చెల్లింపు

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లులన్నింటినీ రాబోయే 10 రోజుల్లోగా లబ్ధిదారుల ఖాతాల్లో ఎలాంటి లంచాలకు తావు లేకుండా జమ చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి పొంగులేటి ప్రకటించారు. నేలకొండపల్లి రైతు వేదికలో నేలకొండపల్లి మండల లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో మొదటి విడత కింద మంజూరైన 648 ఇళ్లలో సుమారు 620 ఇళ్లు పూర్తయ్యాయని, వివిధ కారణాల వల్ల మిగిలిన ఇళ్లను కూడా త్వరలోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, కరెంటు, నీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో రైతన్నలు నష్టపోకూడదనే ఉద్దేశంతో రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి అన్నారు. అంతకుముందు మంత్రి నేలకొండపల్లి మండలం అనాసాగరం నుండి పమ్మి వరకు 2.5 కిలోమీటర్ల మేర 2.80 కోట్ల అంచనా వ్యయంతో బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు.పాలేరు నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై అన్ని ఇంజనీరింగ్ శాఖల అధికారులతో మంత్రిగారు సమీక్షా సమావేశం నిర్వహించారు. కుసుమంచి మండలం, గోరిల్లపాడు తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర టిఎస్ , హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల ఎంపీడీవో ఎర్రయ్య, తహశీల్దార్ రాంప్రసాద్, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీలోని నాయుడుపేట జంక్షన్, టి.ని.వి. రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశానికి హాజరయ్యారు.

ఎల్ నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :

- జేపల్లి గ్రామపంచాయతీ ప్రజలకు ఫార్మర్ అడ్వైజర్ కమిటీ సభ్యురాలు కొర్రావత్ కవిత పవన్ నాయక్

ట్రైనెట్ న్యూస్, కల్వకుర్తి అక్టోబర్ 26 :

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు ముఖ్యంగా రైతులు అప్రమత్తం గా ఉండాలని జేపల్లి గ్రామపంచాయతీ ఫార్మర్ అడ్వైజర్ కమిటీ సభ్యురాలు కొర్రావత్ కవిత పవన్ నాయక్ సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ... రైతులు పంటల సాగు విషయంలో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమ నించాలని సూచించారు. వర్షపాతం ఉష్ణోగ్రతల్లో మార్పులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచన లు సలహాలను పాటిస్తూ పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకో



వడం ద్వారా నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎల్ ని నో ప్రభావం కారణంగా వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి వనరు లను పొదుపుగా వినియోగిం చుకో వాలని అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులు పంటల ఎంపిక విత్తనాల వినియోగం సాగు విధానాల విషయంలో స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసు కోవాలని తెలిపారు. రైతుల సంక్షేమం పంటల రక్షణకు ముందస్తు అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొంటూ జేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు ప్రజలు వాతావరణ పరిస్థితులను బట్టి తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీకి బయలుదేరిన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తాం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



తెలంగాణ రాష్ట్ర ప్రగతి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను అంతర్జాతీయ వేదికపై వివరించి, తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తానని తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు.ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు సోమవారం ఉదయం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో మాట్లాడుతూ, బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ రాష్ట్ర గొంతును బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశాల ద్వారా తెలంగాణ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి సంబంధించిన కీలక అంశాలను వివరించనున్నట్లు తెలిపారు. స్పీకర్ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షించారు.

మిల్లర్లపై కేసులు సరే... అధికారుల సంగతేంటి..?

మిల్లర్ల అవినీతిలో డిఎస్ఓ, డిఎంల ప్రమేయం లేదా?

-అధికారుల పాత్రపై కూడా విచారణ చేపట్టాలి
-అవినీతి అధికారుల చిట్టాను
-ఏసీబీ, సీఐడీ కి అందజేస్తాం
-బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

రాష్ట్రంలో అవినీతికి పాల్పడిన సివిల్ సప్లయ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి అక్రమాస్తులు కూడా జప్తు చేయాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో మీడియాతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో మిల్లర్లపై జరుగుతున్న దాడులు, కేసుల నమోదు వంటి అంశాలను బీసీ పొలిటికల్ జెఏసి స్వాగతిస్తుందని అన్నారు.

అధికారుల సహకారం, అండదండలు లేకుండా మిల్లర్లు సొంతంగా అవినీతికి ఎలా పాల్పడతారని ప్రశ్నించారు. నేడు సివిల్ సప్లయ్ శాఖలో కోట్ల రూపాయల అవినీతి బాగోతం కొనసాగుతుందంటే అందుకు ప్రధాన కారణం అవినీతి అధికారులు కాదా? అని నిలదీశారు. ఇటీవల వనపర్తి జిల్లాలో అనుమతులు లేవంటూ రెండు రైస్ మిల్లులను కూల్చివేశారని గుర్తు చేస్తూ, అనుమతులు లేని రైస్ మిల్లులకు ధాన్యం ఎలా కేటాయించారు? మిల్లింగ్ అనుమతులు ఎవరు ఇచ్చారని, ఈవిధమైన అవినీతి చర్యలకు అధికారులు కారణం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సివిల్ సప్లయ్ శాఖలో పనిచేస్తున్న అనేక మంది డిఎం మరియు డిఎస్ఓలు కోట్లకు పడగెత్తుతున్నారని, ఒక్క సీజన్లో ఒక్కో అధికారి రూ. 3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల వరకు అక్రమంగా సంపాదించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

మిల్లర్లపై జరుగుతున్న దాడుల విధంగానే అధికారులపై కూడా ఏసీబీ, సిఐడి సోదాలు నిర్వహించాలని, అవినీతి అధికారుల అవినీతి చిట్టాను త్వరలో అందజేస్తామని, వారి అక్రమాస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో, వారి బినామీలు ఎవరో గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతి అధికారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, అక్రమ సంపాదన ఒక్కటే కాకుండా ధాన్యం సేకరణ, ట్రక్ షీట్లు, ధాన్యం నిల్వలు, టెండర్ ప్రక్రియ, రవాణా బిల్లులు, బ్యాంకు చెల్లింపులు, స్టాక్ ధ్రువీకరణ పత్రాలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామకాల వంటి వ్యవహారాలలో అధికారులు అనేక అవకతవకలకు పాల్పడుతూ అవినీతిలో కూరుకుపోతున్నారని అన్నారు. అవినీతి అధికారుల భరతం పట్టే వరకు బీసీ పొలిటికల్ జేఏసీ విశ్రమించదని, ప్రభుత్వం అవినీతి అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జెఏసి నాయకులు వివి గౌడ్, దేవర శివ, సిద్ధార్థ్, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం విషయంలో ఎన్నికల కమిషన్ కానీ, రాష్ట్ర ప్రభుత్వం కానీ తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు



హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్, అక్టోబర్,26



.గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం విషయంలో ఎన్నికల కమిషన్ కానీ, రాష్ట్ర ప్రభుత్వం కానీ తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన సనత్ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం మీడియా తో మాట్లాడారు. నవంబర్ 6 వ తేదీన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం ముగుస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. కాలనీలు, బస్తీలు, అపార్ట్ మెంట్ లలో పాదయాత్ర గా తిరుగుతూ ఇంటింటికీ వెళ్ళి అర్హులైన గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు కార్యక్రమం బాధ్యత ఎన్నికల కమిషన్ పై ఉన్నప్పటికీ పట్టించుకోని కారణంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బి ఎల్ ఓ లను కూడా నియమించలేదని మండిపడ్డారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికలలో హైదరాబాద్ నగర పరిధిలో ఒక లక్ష 10 వేల మంది గ్రాడ్యుయేట్ లు ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుతం ఇప్పటి వరకు 23 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ల నుండి ఓటరు నమోదు పత్రాలు స్వీకరించి అధికారులకు అందజేస్తే అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం కూడా ఏ మాత్రం బాధ్యతగా వ్యవహరించడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ అసమర్థ పాలన వలన ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పాలనను గాలికొదిలి రాష్ట్రాల పర్యటన లు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఓటరు నమోదు కార్యక్రమం నియోజకవర్గ ఇంచార్జి గోసుల శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, టి. మహేశ్వరి, అత్తిలి అరుణ గౌడ్, కుర్మ హేమలత, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు గందే నాగులు, టి. శ్రీహరి, ప్రవీణ్ రెడ్డి, నరేందర్, లక్ష్మీపతి, ఏసూరి మహేష్, కరుణాకర్ రెడ్డి, కొండాపురం మహేష్ యాదవ్, అశోక్ యాదవ్, మల్లారెడ్డి, ప్రేమ్, అబ్బాస్, గుడిగే శ్రీనివాస్ యాదవ్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరును పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

రూ.70 కోట్లతో గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులు -- మంత్రి వివేక్ వెంకటస్వామి

చెన్నూరు, ట్రైనెట్ న్యూస్, ఆక్టబర్ 26:



చెన్నూరు పట్టణాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నామని పేర్కొన్నారు. చెన్నూరులో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు నూతన పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

చిరువ్యాపారులకు ఆధునిక దుకాణాలు

చిరువ్యాపారుల ప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో రూ. 1.20 కోట్ల వ్యయంతో 20 దుకాణాల నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ దుకాణాలను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మిగిలిన అర్హులైన చిరువ్యాపారుల కోసం మరో 50 ఆధునిక దుకాణాలను నిర్మించి అందిస్తామని వెల్లడించారు. దీనివల్ల చిరువ్యాపారులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వారి జీవనోపాధికి భరోసా లభిస్తుందని అన్నారు.

రహదారులు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం

చెన్నూరు పట్టణంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ. 1.50 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రధాన రహదారి విస్తరణ పనులను మరో మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. 10వ వార్డులో రూ. 3.50 కోట్లతో 750 మీటర్ల మేర రోడ్డు విస్తరణ, డబుల్ ఆర్మ్ సెంట్రల్ లైటింగ్ పనులు చేపడుతున్నామని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

గోదావరి పుష్కరాలకు రూ.70 కోట్ల నిధులు

గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని చెన్నూరు అభివృద్ధికి రూ. 70 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా గోదావరి తీరంలోని శివాలయాన్ని రూ. 17 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారి నిర్మాణానికి రూ. 6 కోట్లు, పోచమ్మ గుడి వద్ద భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు రూ. 2 కోట్లు, మహాశివరాత్రి సందర్భంగా జైపూర్‌కు వెళ్లే భక్తుల సౌకర్యాల కోసం మరో రూ. 2 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అలాగే, జైపూర్ మండలం వేలాల గ్రామంలో రూ. 4.25 కోట్లతో గోదావరి పుష్కర ఘాట్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పర్యాటక సర్క్యూట్‌తో ఉపాధి అవకాశాలు

చెన్నూరు శివాలయం, క్రొకడైల్ పార్క్, కాళేశ్వరం ప్రాంతాలను అనుసంధానిస్తూ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ ప్రణాళిక ద్వారా చెన్నూరుకు పర్యాటకుల రాక పెరగడంతో పాటు స్థానిక వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రహదారి విస్తరణ పనులకు స్వచ్ఛందంగా సహకరిస్తున్న ప్రజలకు, వ్యాపారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో చెన్నూరు పట్టణ రూపురేఖలను మార్చి, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి, పర్యాటక రంగానికి ప్రోత్సాహం ద్వారా చెన్నూరును సమగ్ర అభివృద్ధి దిశగా నడిపిస్తామని మంత్రి వెల్లడించారు.

కాళేశ్వరం నీళ్లపై కేటీఆర్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ కౌంటర్.. 'కుంగిన బ్యారేజీల్లో నీళ్లు ఎలా నిల్వ చేస్తారు?'

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం చైర్మన్, తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు పెట్టం నవీన్ తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. కమీషన్లకు కక్కుర్తిపడి లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, చివరకు దాని పరిస్థితిని దిగజార్చిన కల్వకుంట్ల కుటుంబం ఇప్పుడు కూడా బాధ్యతారహితంగా మాట్లాడుతోందని నవీన్ ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి 20 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసి ఒడిసిపట్టాలని కేటీఆర్ చెబుతున్నారని, అయితే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన విషయాన్ని ఆయన విస్మరిస్తున్నారని విమర్శించారు. నదిలో ప్రవహించే నీటిని ఎత్తిపోసి వినియోగించుకోవాలంటే అవసరమైన బ్యారేజీలు, నీటి నిల్వ సదుపాయాలు సురక్షితంగా ఉండాలని నవీన్ పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, సుందిళ్ల బ్యారేజీ వద్ద సీపేజీ సమస్యలు ఉన్నాయని ప్రస్తావిస్తూ, ఇలాంటి పరిస్థితుల్లో నీటిని ఎక్కడ నిల్వ చేస్తారని ప్రశ్నించారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదికలో పేర్కొన్న అంశాలను కేటీఆర్ గమనించాలని సూచించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి అన్నారం బ్యారేజీలో నిల్వ చేసినా, అక్కడ నీరు నిలవడం సాధ్యం కాదని ఎన్‌డీఎస్‌ఏ అభిప్రాయపడినట్లు నవీన్ పేర్కొన్నారు. అయితే ఈ వ్యాఖ్యలకు సంబంధించి నివేదికలోని నిర్దిష్ట సిఫార్సులు, సాంకేతిక వివరాలను అధికారిక పత్రాలతో పరిశీలించాల్సి ఉంది.

గోదావరి జలాలను పూర్తిగా వినియోగిస్తున్నాం

తెలంగాణ నుంచి గోదావరి నీరు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతోందంటూ కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నవీన్ తప్పుబట్టారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న నీటిని ప్రజల అవసరాలకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని, సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా కూడా జలాలను వినియోగించుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి వినియోగించుకోలేకపోతున్నారంటూ కేటీఆర్ చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని నవీన్ అన్నారు. రాష్ట్రంలోని నీటి వనరులు, ప్రాజెక్టుల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించకుండా రాజకీయ విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.

కాళేశ్వరం అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు'

కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి భద్రతపై సాంకేతిక సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నవీన్ కోరారు. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, నీటి నిల్వ సామర్థ్యం వంటి అంశాలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు. కేటీఆర్ ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదని నవీన్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం బీఆర్ఎస్ నాయకత్వానికి ఉందని అన్నారు.

సేంద్రియ వ్యవసాయమే మేలు

రైతులకు వ్యవసాయ సంచాలకులు డా. బి. గోపి సూచన

-ఎల్‌నినో నేపథ్యంలో వరి వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు:
-ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా దుబ్బచెర్లలో క్షేత్రస్థాయి పర్యటన
-పప్పుజాతి, నూనెగింజల పంటలను సాగు చేయాలి
-పశుగ్రాసం కొరత రాకుండా స్వల్పకాలిక పశుగ్రాస పంటలు సాగు చేయాలని పిలుపు





హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,అక్టోబర్ 26:

ఖేత్ బచావో అభియాన్ -- సాగు భూమి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐఏఎస్ సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దుబ్బచెర్ల గ్రామంలో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొని, రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గాయని, భూగర్భ జలాలు అడుగంటాయని సంచాలకులు తెలిపారు. రాబోయే ఏడెనిమిది నెలల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే సూచనలున్నందున, రైతులు ఈ యాసంగిలో వరి సాగు చేయవద్దని కోరారు. తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే ఆరుతడి పంటలను మాత్రమే ఎంచుకోవాలని, పప్పుజాతి, నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు.

మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలని, అంతర్జాతీయంగా గిరాకీ ఉన్న ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని రైతులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండటం వల్ల ఇక్కడి రైతులు పండించిన కూరగాయలకు అధిక డిమాండ్ ఉంటుందని, అధిక గిరాకీ ఉన్న పంటలు పండిస్తే మంచి ఆదాయం పొందవచ్చని వివరించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, పశుగ్రాసం కొరత రాకుండా స్వల్పకాలిక పశుగ్రాస పంటలు సాగు చేయాలని కోరారు.

పంట సాగులో నేల సంరక్షణే అత్యంత కీలకమని సంచాలకులు అన్నారు. నేలను కాపాడుకుంటేనే దిగుబడులు, రైతు ఆదాయం పెరుగుతాయని, భావితరాలకు సాగుయోగ్యమైన భూమిని అందించగలమని చెప్పారు. సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన మేరకే వాడుతూ, క్రమంగా వాటిపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం రైతులకు, నేలకు మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. వీలైతే ప్రతి రైతు కనీసం ఒక ఎకరంలో రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం చేయాలని, సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని తెలిపారు.

రైతు క్షేత్రం సందర్శన

సమావేశం అనంతరం సంచాలకులు గ్రామానికి చెందిన రైతు శ్రీ సీతారాములు క్షేత్రాన్ని సందర్శించారు. సొంతంగా 10 ఎకరాలు, కౌలుకు తీసుకున్న 15 ఎకరాలు కలిపి మొత్తం 25 ఎకరాల్లో ఆయన ఈత, ఆయిల్ పామ్, వరి, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. పంటల పరిస్థితిని పరిశీలించిన సంచాలకులు, సాగు విధానాలు, ఎదురవుతున్న సమస్యల గురించి రైతుతో ముచ్చటించి అడిగి తెలుసుకున్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రతిజ్ఞ

కేంద్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి నవంబర్ 1 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోంది. 'సమగ్రతతో సుసంపన్నత' అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ వారోత్సవాల ఉద్దేశం అవినీతి నిర్మూలన, పారదర్శకత, నైతిక విలువలను పెంపొందించడం. ఇందులో భాగంగా సంచాలకులు, అధికారులు, రైతులతో కలిసి సమగ్రత ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి సుజాత, కృషి విజ్ఞాన కేంద్రం సంచాలకులు డా. చంద్రకాంత్, ఉద్యాన విషయ నిపుణులు శ్రీ శ్రీకృష్ణ, పశువైద్య విషయ నిపుణులు డా. సుధీర్, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి డా. దిలీప్, మహేశ్వరం సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారి, సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

శివాలయం -ఆంజనేయస్వామిదేవాలయానికి విరాళం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

చెరుకూరు గ్రామంలో శివాలయం మరియు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం శరవేగంగా సాగుతున్న వేళ... దాతల సహకారం వెల్లువలా కొనసాగుతున్నది.

ఈ క్రమంలో...తండ్రి : కీర్తిశేషులు,,శ్రీ గోలి పర్వత్ రెడ్డి కుమార్తెచరగొండ గ్రామానికి చెందినశ్రీమతి సుజాత

భర్త : శ్రీ వెంకట్ నారాయణ రెడ్డిశివాలయం మరియు ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ నిమిత్తం రూ. 25,116/- (ఇరవై ఐదు వేల నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు.వారి ఈ గొప్ప దాతృత్వానికి ఆలయ నిర్మాణ కమిటీ మరియు గ్రామస్తులందరూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

వారికి, వారి కుటుంబానికి ఆ పరమశివుని కృపా కటాక్షాలు, ఆంజనేయ స్వామి వారి ఆశీర్వాదాలు



ఎల్లప్పుడూ ఉండాలని మనసారా కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో ప్రతాపరెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి,రాజేందర్ రెడ్డి, వీరారెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

ఇట్లు,శివాలయం & శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ కమిటీ, చెరుకూరు

డిండి ప్రాజెక్టుకు,జలకళ రైతుల్లో ఆశలు చిగురింపు కొంపల్లి వేణుగోపాల్,



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

కే,ఎల్, ఐ, ప్రాజెక్టు నుంచి మూడు మోటార్ల ద్వారా నీటి విడుదల రేపు నైట్ వరకు వెండి ప్రాజెక్టుకు చేరే అవకాశం డిండి ప్రాజెక్టు పరిధిలోని రైతులను శుభవార్త,కే,ఎల్,ఐ, ప్రాజెక్టు ద్వారా ఈరోజు మోటర్లు ఆన్ చేసి డిండి ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయడం జరిగింది విడుదల చేసిన నీరు రేపు నైట్ వరకు డిండి ప్రాజెక్టుకు చేరుకునే అవకాశం ఉంది,డిండి ప్రాజెక్టులోకి, నీరు చేరితే రైతులకు సాగునీటి అవసరాల కోసం ఎంతో ఉపయోగపడే అవకాశం ఉండటంతో పాటు వ్యవసాయానికి భరోసా లభిస్తుందని ఆశాభావం వ్యక్తమావుతుంది నీటి లభ్యత పెరిగితే పంట సాగుకు రైతుల వ్యవసాయ అవసరాలకు మేలు జరిగే అవకాశం ఉంది ఈ సందర్భంగా తవక్లపూర్ గ్రామ పెద్దలు.అల్వాల్ రెడ్డి. జగన్మోహన్ రెడ్డి. చెరుకుపల్లి. మాజీ సర్పంచ్ వేంరెడ్డి వెంకటరెడ్డి. దామోదర్ రెడ్డి. తదితరులు కేలే ప్రాజెక్టు ను సందర్శించి నీటి విడుదలను పరిశీలించారు డిండి ప్రాజెక్టులోకి నీరు చేరితే రైతులకు సాగునీటి విషయంలో ఊరట గించనుంది మూడు మాటల ద్వారా నీటి విడుదలతో రైతులలో కొత్త ఆశలు చిందిస్తున్నాయి

కోతుల నడుమ గ్రామంలో బీజేపీ బూత్ కమిటీల ఎంపిక.. పార్టీలో చేరిన పలువురు యువకులు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఎల్కతుర్తి: హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలోని కోతుల నడుమగ్రామంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బూత్ కమిటీల ఎంపిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎల్కతుర్తి మండల బీజేపీ అధ్యక్షుడు మతుర్తి శ్రీకాంత్ యాదవ్, మండల ఎస్ఎస్ఎల్ రాజు సమక్షంలో ఈ ఎంపిక ప్రక్రియ జరిగింది.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బూత్ నెంబర్ 285 ,286 కమిటీ అధ్యక్షుడిని మరియు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కూతురునడుమ గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆదివారం పార్టీలో చేరారు.

నూతనంగా పార్టీలో చేరిన కానిపర్తి శ్యాంసుందర్రావు, ఎర్రోళ్ల అఖిల్, మాట్ల వినయ్, రావుల శ్రీధర్, మాట్ల విశాల్, రావుల శ్రీకాంత్, పల్లెపు శ్రీను, గట్టు శ్రీనివాస్లకు మండల



అధ్యక్షుడు మతుర్తి శ్రీకాంత్ యాదవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే రోజుల్లో బూత్ స్థాయి నుండి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మాదిగ ఉద్యమకారుడు సాతుర్ వెంకన్నకు చేయూత

వైద్యం కోసం నిమ్స్ డాక్టర్లతో మాట్లాడిన రాష్ట్ర నాయకులు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన ప్రముఖ ఎమ్మార్పీఎస్ మాదిగ ఉద్యమకారుడు సాతుర్ వెంకన్న అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర నాయకులు ఆయనను పరామర్శించారు. సోమవారం దామెర గ్రామంలోని వెంకన్న నివాసానికి వెళ్లిన సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పేరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాతుర్ వెంకన్న దంపతులు ఇద్దరూ మాదిగ ఉద్యమంలో ఎంతో కీలక భూమిక పోషించారని కొనియాడారు. ఉద్యమానికి వారు చేసిన సేవలను అభినందిస్తూ, మాదిగ సమాజం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంకన్నకు మెరుగైన వైద్యం అందించేందుకు గానూ నిమ్స్ (NIMS) ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి, అవసరమైన చికిత్స త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.



అదేవిధంగా, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం తరపున పూర్తి ఉచిత మెరుగైన వైద్య సహాయం అందేలా గట్టిగా కృషి చేస్తామని రాష్ట్ర నాయకులు డాక్టర్ పేరుమాండ్ల రామకృష్ణ, రేగుంట సునీల్ మాదిగ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్, మాదిగ హక్కుల దండోరా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

సోమవారం జిల్లా కలెక్టర్, మహబూబాబాద్ కలెక్టరేట్ లోని

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిశ్రీజ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి ప్రపంచానికి పరమ పవిత్రమైన రామాయణాన్ని వరంగా అందించిన ఆదికవి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమములో వసతి గృహ సంక్షేమ అధికారులు, జిల్లా అధికారులు, ఐ డి ఓ సి కార్యాలయ సిబ్బంది, మరియు జిల్లాలోని బోయ సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

జాబితాపూర్‌లోరూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనంను ప్రారంభించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

జగిత్యాలరూరల్‌మండలం జాబితాపూర్ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామ పంచాయతీ భవనాలు ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.రాజకీయాలు ఎన్నికల వరకు పరిమితం అని అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు.ఇందిరమ్మ ఇళ్లు మంజూరు తో పేద ప్రజల సొంతింటి కల సాకారం అవుతుంది అన్నారు.ఎల్ నీ నో సూపర్ ఎల్ నీ నో గా మారబోతోంది అని ప్రజలు అప్రమత్తం గా ఉండి కరెంట్ నీరు పొదుపుగా వాడాలని అన్నారు.

రైతులు ఆరుతడి పంటలు సాగు వైపు ఆలోచన



చేయాలని సూచించారు.

రైతుల పంట ఉత్పత్తుల అమ్మకం ప్రక్రియలో ,కరెంట్ విషయం లో సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజెంగి నందయ్య, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఎంపీడీఓ రమాదేవి, ఎంఆర్ఓ హకీం, ఎంపీవో రవి బాబు, ఏఈ విజయ్, మాజీ సర్పంచ్ అంకం సతీష్,పెండెం రాములు,





నక్కల రవీందర్ రెడ్డి,బాల ముకుందం,వార్డు సభ్యులు, గ్రామస్తులు, నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలు: కేతిరెడ్డి పెద్దారెడ్డి

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు ప్రతిపక్షాలపైఅణచివేతధోరణినిఅవలంబిస్తున్నారని, వైసీపీనాయకులను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేసేందుకే ప్రభుత్వం తప్పుడు మరియు అక్రమ కేసులుబనాయిస్తోందనిమాజీఎమ్మెల్యేకేతిరెడ్డిపెద్దా రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంచేసేలా ప్రభుత్వ తీరు కొనసాగుతోందని ఆయన మండిపడ్డారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ

ఎన్నికల వేళ కక్ష సాధింపులు:

రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ మరియు జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో, వైసీపీ కార్యకర్తలు మరియు స్థానిక నాయకులతో సమావేశమై



భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తున్న కీలక సమయంలోపోలీసులుఏకపక్షంగావ్యవహరించారని కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. ఎలాంటి సంబంధం లేకపోయినా తమపై మరియు కార్యకర్తలపై కిడ్నాప్ ఆరోపణలు మోపుతూ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిస్సహాయులను పరామర్శిస్తే తప్పా?

తిమ్మంపల్లి ఎంపీటీసీ స్థానానికి సంబంధించి నామినేషన్ వేయలేకపోయిన ఒక నిరుపేద ఎస్సీ మహిళ తీవ్ర మనోవేదనకు గురైందని, ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పేందుకే తాము అక్కడికి వెళ్లామని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై స్పందించి, బాధితులకు అండగా నిలవడం తప్పైతే... ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేసేది లేదని తేల్చిచెప్పారు. శాంతియుతంగా వెళ్లిన తమపై కక్ష కట్టి అక్రమ కేసులు నమోదు చేయడం పాలకుల నిరంకుశ పాలనకు నిదర్శనమని విమర్శించారు.


మెట్ల మార్గానికి రూ. 100 కోట్లు, రెండో ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ. 50 కోట్లు మంజూరు చేయాలి: పల్నాడు కోటప్పకొండపై ప్రజా ఆగ్రహం, దాతలు ముందుకు రావాలని పిలుపు!

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

పల్నాడు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి సన్నిధి అభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం తారస్థాయికి చేరిందని భక్తులు, స్థానికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఎంతో చారిత్రక ప్రాముఖ్యత కలిగిన మెట్ల మార్గానికి సంబంధించి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నుంచి అన్ని రకాల అనుమతులు ఎప్పుడో వచ్చినా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గానీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గానీ దీనికోసం ఇప్పటివరకు రూపాయి కూడా విదిలించిన దాఖలాలు లేవు. ప్రభుత్వాల నుంచి స్పందన కరువైన నేపథ్యంలో, ప్రజాక్షేత్రంలో పాలకుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇదే తీరు కొనసాగితే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన రాజకీయ బుద్ధి చెబుతారని గట్టిగా హెచ్చరిస్తున్నారు.

?దాతలు, కార్పొరేటర్లు ముందుకు రావాలి – భావితరాలు గుర్తుంచుకునేలా శాశ్వత గుర్తింపు:

ప్రభుత్వాలు పట్టించుకోని ఈ తరుణంలో, స్థానిక కార్పొరేటర్లు గానీ, ప్రజాప్రతినిధులు గానీ, లేదా సమాజంపై మమకారంతో ఎవరైనా గొప్ప దాతలు, మహానుభావులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా నిధులు విరాళంగా అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి పుణ్యక్షేత్రం అభివృద్ధి కోసం ముందుకు వచ్చి ఆర్థిక సాయం



అందించే దాతల పేర్లను చరిత్రలో నిలిచిపోయేలా ప్రతిష్టాత్మకంగా శాశ్వతంగా ఏర్పాటు చేస్తామని, రాబోయే భవిష్యత్ తరాలు, వారి బిడ్డల తరాలన్నీ కూడా ఆ దాతల పేర్లను ఎప్పటికీ కృతజ్ఞతతో గుర్తుపెట్టుకునేలా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. తమ పేర్లు శాశ్వతంగా నిలిచిపోయే ఈ సువర్ణ అవకాశాన్ని దాతలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తున్నారు.

రూ. 100 కోట్లతో మెట్ల మార్గం, విద్యుత్ మరియు మంచినీటి వసతులు:

కొండపైకి వెళ్లే అత్యంత కీలకమైన మెట్ల మార్గం నిర్మాణంతో పాటు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పాపనేశ్వర స్వామి వారి ప్రాంతానికి, పాప

విమోచన స్వామి వారి కాడికి, అలాగే పాత కోటేశ్వర స్వామి వారి సన్నిధికి నిరంతరం అంతరాయం లేని విద్యుత్ సౌకర్యం మరియు సురక్షితమైన మంచినీటి వసతులు కల్పించేందుకు ప్రత్యేకంగా రూ. 100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

?రెండో ఘాట్ రోడ్డు కోసం రూ. 50 కోట్లు మంజూరు చేయాలి:

మహాశివరాత్రి తిరునాళ్లు, విశేష పర్వదినాల సమయంలో కోటప్పకొండకు భక్తులు అశేషంగా తరలివస్తుంటారు. అయితే ఉన్న ఒక్కటే ఘాట్ రోడ్డుపై విపరీతమైన రద్దీ ఏర్పడి తీవ్రమైన ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతోంది. ఆ సమయంలో భక్తులు ముప్పతిప్పలు పడుతూ మూడు చెరువుల నీళ్లు తాగిన దుస్థితి ఎదురవుతోంది. ఒక్కోసారి జిల్లా కలెక్టర్ వాహనం సైతం ఆ ట్రాఫిక్‌లో గంటల తరబడి ఇరుక్కుపోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. పోలీసులు ఎంత కష్టపడి విధులు నిర్వర్తించినా, చిన్న వాహనం రిపేరు వచ్చినా రోజంతా ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతోంది. ఈ శాశ్వత సమస్యకు శాశ్వత పరిష్కారంగా రెండో ఘాట్ రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం తక్షణమే రూ. 50 కోట్లు మంజూరు చేయాలని భక్తులు మరియు ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

అంతర్గామాలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

జగిత్యాల అంతర్గం లో పవిత్ర రామాయణ ఇతిహాస రచయిత, మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జగిత్యాల రూరల్ మండలం అంతర్గం గ్రామంలో వాల్మీకి బోయ సంఘంలో వాల్మీకి చిత్ర పటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించి,నియోజకవర్గ ప్రజలందరికీ వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్

మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తినిస్తూనే ఉంటుంది

వాల్మీకి కీర్తిప్రతిష్టల్ని ఆయన జయంతి సందర్భంగా స్మరించుకోవడం మన పూర్వజన్మ సుకృతం.సామాన్య ప్రజలకు రామాయణం అర్థమయ్యే విధంగా రామాయణాన్ని రచించిన వాల్మీకిని అందరు గుర్తుంచుకోవాలని కోరారు

మన ధర్మాన్ని మనం కాపాడుకోవాలి ఇతర మతాలను గౌరవించాలి అని అన్నారుబ్రిటిష్ వారి హయాంలో మన సంస్కృతి సంప్రదాయాలు గ్రంథాలు కనుమరుగు చేసే ప్రయత్నం చేశారు.గ్రామంలో వాల్మీకి ఆలయ నిర్మాణం



కోసం తన వంతుగా కృషి చేస్తా అన్నారు

జగిత్యాల నియోజకవర్గం లో విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం .200 కోట్ల తో ఇటిగ్రేటెడ్ స్కూల్ కు భూమిపూజ,235కోట్ల తో ఆసుపత్రి పనులు జరుగుతున్నాయి.

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను అంతర్గం గ్రామానికి మంజూరు చేయటం జరిగింది

లింగం చెరువు ను సుందరీకరణ చేయటం జరిగింది.గ్రామానికి చెందిన మండల దేవయ్య మెదడు నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఉండగా చికిత్స చేసుకొనే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందిపడుతూ ఉండగా స్థానిక నాయకులు



దేవయ్య ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారి దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి ద్వారా 2లక్షల50వేల రూపాయల ఎల్ఓసి నీ మంజూరు చేయించి అంతర్గంలో ఈరోజు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ నోముల రమ్య శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ బాలు గౌడ్ మాజీ సర్పంచులు నక్కల రవీందర్ రెడ్డి బోనగిరి నారాయణ ఏఎంసీ డైరెక్టర్ రాజి రెడ్డి పాక్స్ డైరెక్టర్ రాజయ్య,మాజీ ఎంపీటీసీ ఎల్లాల రాజిరెడ్డి, నాయకులు అరుణ్ బోయ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై ఏపీ ఎస్ఈసీ కీలక ఆదేశాలు.. పోస్టల్ బ్యాలెట్ ముద్రణ మార్గదర్శకాలు జారీ!

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగానే పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఉండేందుకు, పారదర్శకతను కాపాడేందుకు ఎస్ఈసీ ఈ స్పష్టమైన మార్గదర్శకాలను ఖరారు చేసింది.

బ్యాలెట్ పత్రాల్లో అభ్యర్థుల వర్గీకరణ:

ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం, పోస్టల్ బ్యాలెట్ పత్రాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను అత్యంత స్పష్టంగా మూడు ప్రత్యేక కేటగిరీలుగా విభజించాలని సూచించింది. దీనివల్ల ఓటర్లకు మరియు ఎన్నికల సిబ్బందికి బ్యాలెట్ పేపర్ పరిశీలించడం సులభతరమవుతుందని భావిస్తున్నారు.

తెలుగు మరియు ఇంగ్లీష్ భాషల్లో వివరాల ముద్రణ:

బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థి పేరు మరియు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీ పేరును ముందుగా ప్రాధాన్యత క్రమంలో తెలుగు భాషలోనే ముద్రించాలని స్పష్టం చేసింది. ఆ



తర్వాత దానికిందనే స్పష్టంగా ఆంగ్లంలో (ఇంగ్లీష్‌లో) కూడా అభ్యర్థి, పార్టీ వివరాలు ముద్రించాల్సి ఉంటుందని నిబంధన విధించింది.

నిబంధనల కఠిన అమలుకు ఆదేశాలు:

పోస్టల్ బ్యాలెట్ పత్రాల రూపకల్పనలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, బ్యాలెట్ పత్రాలపై ఎలాంటి అనధికారిక గుర్తులు లేదా మార్కింగ్‌లు ఉండకూడదని ఎస్ఈసీ గట్టిగా హెచ్చరించింది. రాబోయే ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు అందరూ ఎన్నికల నిబంధనలను ఎక్కడా రాజీ పడకుండా ఖచ్చితంగా పాటించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

అర్ణబ్' అంటే ఏమిటి? తుపాను పేరు వెనుక ఆసక్తికరమైన కథ.. పూర్తి వివరాలు!



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

బంగాళాఖాతంలో ఏర్పడిన ముప్పునకు సంబంధించి వాతావరణ శాఖ ప్రత్యేకంగా 'అర్ణబ్' అనే పేరును ఖరారు చేసింది. సాధారణంగా వచ్చే తుపానులకు రకరకాల పేర్లు పెడుతుండటంతో, అసలు ఈ పేరు వెనుక ఉన్న ఆసక్తికరమైన కథ ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

స్థానిక భాషలు మరియు ప్రాంతీయ సంస్కృతుల ఆధారంగా ఈ పేర్లను ఎంపిక చేస్తుంటారు. బెంగాలీ భాషలో 'అర్ణబ్' అంటే సముద్రం లేదా మహాసముద్రం అని అర్థం వస్తుంది. ప్రత్యేక విశేషం ఏమిటంటే, ఈ పేరును పొరుగు దేశమైన బంగ్లాదేశ్ సూచించింది.

ప్రపంచ వాతావరణ సంస్థ మరియు ఐరాస ఆర్థిక, సామాజిక కమిషన్ నిర్దేశించిన స్పష్టమైన మార్గదర్శకాల ప్రకారం, ఉత్తర హిందూ మహాసముద్ర ప్రాంత పరిధిలోకి వచ్చే మొత్తం 13 దేశాలు కలిసి సంయుక్తంగా ఈ తుపాన్ల పేర్ల జాబితాను ముందుగానే రూపొందిస్తాయి. ఈ విధంగా సిద్ధం చేసిన జాబితా నుంచి ఒకదాని తర్వాత ఒకటిగా వరుస క్రమంలో క్రమపద్ధతిలో ఆయా తుపాన్లకు పేర్లను కేటాయిస్తూ వస్తున్నారు.

రైల్వే ట్రాక్‌పై యువకుడి అనుమానాస్పద మృతి.. పల్నాడు జిల్లాలో కలకలం!



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జిల్లాలోని రాజుపాలెం మండలం అనుపాలెం సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై సోమవారం ఉదయం ఓ యువకుడి మృతదేహం రక్తపు మడుగులో విగతజీవుడిగా పడి ఉండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఉదయం నడకకు వెళ్లిన స్థానికులు ఈ మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

మృతుడి వివరాలు గుర్తింపు:

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రాథమిక విచారణ మరియు లభించిన ఆనవాళ్ల ఆధారంగా మృతుడు మాచవరం మండలం తురకపాలెం గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించినట్లు సమాచారం అందింది. కుటుంబ సభ్యులకు మరియు బంధువులకు పోలీసులు సమాచారం అందించడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఆత్మహత్యనా? లేక హత్యనా? అనే కోణంలో దర్యాప్తు:

యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడవేశారా? అనే కోణంలో పోలీసులు తీవ్రంగా దర్యాప్తు జరుపుతున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసు అధికారులు అన్ని కోణాల్లోనూ కేసును విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే అసలు నిజాలు

ముత్యంపేట నిజాం చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరవాలి అని జగిత్యాల జిల్లా కలెక్టర్కు ప్రజావాణిలోకోరిన... -కోరుట్ల జనసేన పార్టీ సీనియర్ నాయకులు గంగం అజయ్ కుమార్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



జగిత్యాల జిల్లా ముత్యంపేటలోని నిజాం చక్కెర కర్మాగారం 23.12.2015 నుండి మూతపడి ఉందని, దీని వల్ల కోరుట్ల నియోజకవర్గంతో పాటు ముత్యంపేట, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, రాయికల్ మండలాలకు చెందిన వేలాది మంది చెరకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కోరుట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు గంగం అజయ్ కుమార్ అన్నారు.

గతంలో ఈ ప్రాంతంలో 10 వేల నుండి 15 వేల ఎకరాల్లో చెరకు సాగు జరిగేదని, ఏడాదికి 2.5 లక్షల టన్నుల క్రషింగ్ జరిగేదని, ఫ్యాక్టరీ మూతపడటంతో రైతులు 100 కి.మీ దూరంలోని కామారెడ్డికి టన్నుకు రూ.1300 అదనపు ఖర్చుతో చెరకును తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం 2024 జనవరిలో మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసి, 2025 నాటికి ఫ్యాక్టరీ తెరుస్తామని హామీ ఇచ్చి, రూ.172 కోట్ల బ్యాంకు బకాయిలు చెల్లించినప్పటికీ, ఇప్పటి వరకు యంత్రాల మరమ్మత్తులు మొదలు కాలేదని, బడ్జెట్ కూడా ప్రకటించలేదని విమర్శించారు.

ఈ నేపథ్యంలో ఈరోజు జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగిందని, Grievance ID: DJGTL26102600027 కు సెక్షన్-A కి ఫార్వార్డ్ అయ్యిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారుఎడమల జయపాల్ రెడ్డి, బత్తిని బాబు గౌడ్, మాద ప్రత్యూషలు పాల్గొన్నారు

రైతుల మోసంపై వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ సమరభేరి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాష్ట్రవ్యాప్త ధర్నాలకు పిలుపు!

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం తీవ్ర దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడక, పంటలు పండక అన్నదాతలు అల్లాడిపోతుంటే.. మరోవైపు ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు వారినిమరింత క్షోభకు గురిచేస్తున్నాయి. కనీసం గిట్టుబాటు ధర ఇవ్వకుండా ప్రభుత్వాలు మోసగిస్తున్న తీరుపై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అసలు ప్రస్తుతం రైతులకు ప్రభుత్వాల నుంచి ఒరిగేది ఏమీ లేదని, కేవలం మోసాలు తప్ప ఏమివ్వడం లేదని మండిపడుతున్నారు.

పెరిగిన పెట్టుబడులు - ఎరువుల భారం:

మరోవైపు ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి రైతు నడ్డి విరుస్తున్నాయి. ఒక మందు బస్తా కొనుగోలు చేయాలన్నా సామాన్య రైతులకు తలకు మించిన భారమవుతోంది. దీనికి తోడు గతంలో అందుతున్న 'రైతు భరోసా' పథకం కూడా నీరుగారిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పది ఎకరాలు, ఇరవై ఎకరాలు ఉన్న పెద్ద రైతులు సైతం బోర్ల కింద పంటలు సాగు చేసుకుందామంటే విపరీతమైన కష్టాలు ఎదుర్కొంటున్నారు.



కరెంటు కోతలు - బోరు బావుల కింద కష్టాలు:

ఉచిత విద్యుత్ ఇస్తామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు, క్షేత్రస్థాయిలో మాత్రం కేవలం పేరుకు మాత్రమే 8 గంటల కరెంటు ఇస్తున్నాయి. ఆ ఇస్తున్న నామమాత్రపు కరెంటు కూడా సరిగ్గా రాక, హెచ్‌టీ, ఎల్టీ సబ్‌స్టేషన్ల సమస్యలతో బోర్ల కింద పంటలను కాపాడుకోవడం రైతులకు గగనమైపోయింది. కరెంట్ లేక, సాగునీరు అందక పెట్టుబడులన్నీ బూడిదలో పోసిన పన్నీరులా మారుతున్నాయి.

దళారీ వ్యవస్థ రాజ్యం - కార్పొరేటర్ల దోపిడీ:

ప్రకృతి వైపరీత్యాలు, కరువు కాటకాలతో రైతులు అల్లాడిపోతుంటే, మరోవైపు అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు, నాయకులు, దళారులు కలిసి రైతుల కష్టాన్ని నిలువునా దోచుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అయినా, రాష్ట్ర ప్రభుత్వం అయినా రైతుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విపరీతంగా పెరిగిన ధరలు - రైతులకు దక్కని ప్రతిఫలం:

ప్రస్తుత బహిరంగ మార్కెట్‌లో ధరలు చుక్కలను తాకుతున్నాయి. కానీ ఆ లాభాలన్నీ దళారుల, కార్పొరేటర్ల జేబుల్లోకి వెళ్తున్నాయి తప్ప రైతన్నకు మాత్రం ఒరిగేది ఏమీ లేదు. మార్కెట్లో ధాన్యం ధర క్వింటాకు రూ. 4,000 నుంచి రూ. 4,500, చివరికి రూ. 5,000 వరకు అమ్ముడవుతోంది. అలాగే కేవలం 25 కిలోల బియ్యం సంచి ఏకంగా రూ. 2,500 దాకా అమ్ముతున్నారు. ఇంత భారీ రేట్లు పలుకుతున్నప్పటికీ, కష్టపడి పండించిన రైతుకు మాత్రం కనీస గిట్టుబాటు ధర దక్కకుండా కార్పొరేటర్లు, దోపిడీదారులు అంతా కలిపి నిలువునా దోచుకుంటున్నారు.

ధర్నాలకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ: ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి, కరువుతో అల్లాడుతున్న రైతులకు తక్షణమే ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు చేపట్టి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర పోరాటాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కోనేరు హంపి, పీవీ సింధు ఘనతపై వైఎస్ జగన్ హర్షం.. అభినందనల వెల్లువ!

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారతీయ మహిళా క్రీడాకారులు అద్భుత విజయాలతో దేశ కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేస్తున్నారు. తాజాగా అంతర్జాతీయ టోర్నమెంట్లలో సత్తా చాటి అపారమైన ప్రతిభ కనబరిచిన ప్రముఖ చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి మరియు స్టార్ షట్లర్ పీవీ సింధులను రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వారిద్దరి అసాధారణ విజయాలు యావత్ దేశానికి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని ఆయన కొనియాడారు.

యూరోపియన్ చేస్ క్లబ్ కప్ విజేతగా కోనేరు హంపి:

మహిళల యూరోపియన్ చేస్ క్లబ్ కప్ పోటీల్లో అక్షరాలా విశ్వరూపం ప్రదర్శించిన భారతదేశపు ప్రముఖ చెస్ దిగ్గజం కోనేరు హంపి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. అత్యంత హోరాహోరీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో తన



అనుభవాన్నంతా ఉపయోగించి అద్భుత ఆటతీరుతో ప్రత్యర్థులను ఒత్తిడికి గురిచేస్తూ ఆమె గోల్డ్ మెడల్ సాధించారు. ఈ ఘనత సాధించడం ద్వారా ఆమె మరోసారి ప్రపంచ వేదికపై తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన పీవీ సింధు:

మరోవైపు, ప్రతిష్టాత్మకమైన ఫ్రెంచ్ ఓపెన్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి రన్నరప్‌గా నిలిచారు. టోర్నీ ఆసాంతం అటాకింగ్ గేమ్‌తో ఆకట్టుకున్న సింధు, ఫైనల్ వరకు దూసుకెళ్లి రజత పత్కాన్ని సొంతం చేసుకున్నారు. వరుసగా అంతర్జాతీయ టోర్నీలలో రాణిస్తూ ఆమె తన ఫామ్‌ను కొనసాగిస్తున్నారు.

బాలికలకు స్ఫూర్తిదాయకం:

ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయ వేదికలపై వీరిద్దరూ మన రాష్ట్ర, దేశ కీర్తిని దశదిశలా ఇనుమడింపజేశారని ప్రశంసించారు. వీరిద్దరి అద్భుత విజయాల వెనుక ఎంతో కఠిన శ్రమ, పట్టుదల, అంకితభావం దాగి ఉన్నాయని, ఈ ప్రయాణం క్రీడా రంగంలో రాణించాలనుకునే ఎంతో మంది యువ బాలికలకు ఎప్పటికీ గొప్ప స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ వీరిద్దరూ మరిన్ని గొప్ప విజయాలు సాధించి దేశానికి మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

తుఫాన్ హెచ్చరికల వేళ కోనసీమలో హైఅలర్ట్.. పాఠశాలలకు రెండు రోజుల పాటు సెలవులు ప్రకటన!

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాన్ ముప్పు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపుతోంది. 'ఆర్నాబ్' తుఫాన్ (అదాబ్ తుఫాన్) ముంచుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, వాతావరణ శాఖాధికారులు అత్యంత అప్రమత్తమయ్యారు. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం మరియు ముందస్తు రక్షణ చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

తుఫాన్ ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పాఠశాలలకు రేపు, ఎల్లుండి రెండు రోజుల పాటు సెలవులను అధికారికంగా



ప్రకటించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల వీచే ప్రమాదం ఉండటంతో తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగాఉండాలనిఅధికారులు సూచించారు. వాతావరణ శాఖ అధికారుల అంచనా ప్రకారం, ఈ ఆర్నాబ్ తుఫాన్ యానం సమీపంలో తీరం దాటే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉండటంతో పాటు కుండపోత వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. ఈ తుఫాన్ ప్రభావం ప్రధానంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలపై తీవ్రంగా ఉండే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకారులు ఎవరూ కూడా సముద్రంలోకి వేటకు వెళ్లరాదని కఠిన ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న జిల్లా యంత్రాంగం, ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ (NDRF) మరియు ఎస్డీఆర్ఎఫ్ (SDRF) బృందాలను సిద్ధంగా ఉంచారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, అధికారిక సూచనలను పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఖ

58 సంవత్సరాలు నిండిన ప్రతి గల్ఫ్ నుండి తిరిగివచ్చిన వారికి ఆసరా పెన్షన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని- ఐహెచ్ ఆర్పీసీ అధ్యక్షులు ఆడెపు రాజమౌళి

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

గల్ఫ్ లో పనిచేస్తున్న ఎంతోమందికీ షుగరు బిపి అల్సర్ గుండెపోటుతో పక్షవాతంతో మరణిస్తున్నా కుటుంబాలకు ఆదుకోవాలని 58 సంవత్సరాలు నిండిన ప్రతి గల్ఫ్ నుండి తిరిగివచ్చిన వారికి పెన్షన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకొని ప్రవాస భారతీయులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ముక్తకంఠంతో ఎన్నారైలు కోరుతున్నారు దీనికి సంబంధించిన ఎన్నారై లకు ఒక ప్రత్యేకమైన మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి అందరికీ అందుబాటులోకి తేవాలని ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆడెపు రాజమౌళి ఒక ప్రకటనలో కోరారు



గల్ఫ్ నుండి తిరిగి వచ్చిన వారికి 58 సంవత్సరాల నిన్న ప్రతి ఒక్కరికి ఆసరా పింఛన్లు ఇవ్వాలని ఆయన అన్నారు

ఎంతోమంది గల్ఫ్ లో చనిపోతున్నారని వారు మన దేశానికి ఆర్థికంగా సహాయపడుతూ వారి జీవనాన్ని కొనసాగిస్తున్నారు బ్రతుకుదామంటే పనులు లేక ఎడారి ప్రాంతంలో గొర్లు మేకలు తోటల్లో ఖర్జూర చెట్లు ఎక్కుతూ ఎంతో శ్రమపడి అక్కడి నుండి విదేశీ ద్రవ్యాన్ని మన దేశానికి పంపి మన దేశ ఆర్థిక పరిస్థితికి ఒక అండగా ఉంటూ చేస్తున్న సేవలు ఆ కుటుంబానికి మన భారత దేశ ఆర్థిక నిలువలకు దోహదపడుతున్నారని అలాంటివారు మధ్యలో ఎంతో మంది గుండెపోటు తో మరణించిన వారు ఈ కాలంలో ఎక్కువగా ఉన్నారు వీరి కొరకై రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం చనిపోయిన కుటుంబానికి 5 లక్షల ఆర్థిక సహాయం ఇస్తూ ఆ కుటుంబంలో ఉన్నవారికి పెన్షన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని రాజమౌళి డిమాండ్ చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకొని వారికి తప్పనిసరి ఆ కుటుంబంలో పిల్లలను గురుకుల విద్యాలయంలో చోటు కల్పిస్తూ ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాగా ఆసరా పింఛన్లు ఇవ్వాలని రాజమౌళి కోరారు

ఆలూరులో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు.

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఆలూరు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆలూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రాలను కర్నూలు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా పోలీసు ఉన్నతాధికారి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరల్ క్వామర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు చేపట్టిన చర్యలను సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సౌకర్యాలు, రిసెప్షన్ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విధులు నిర్వహించే అధికారులు సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల సామగ్రి నిర్వహణ, భద్రతా చర్యలు, కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన సౌకర్యాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ప్రశాంతత, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ



పరిశీలన ద్వారా ఆలూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికలరిటర్నింగ్ అధికారి ఆనంద రాజ్ కుమార్, ఎంపీడీవో మద్దిలేటి స్వామి, తహసిల్దార్ శోభా సువర్ణమ్మ, సీఐ రవి శంకర్ రెడ్డి, ఎస్ ఐ మన్మధ విజయ్, ఆర్ ఐ బసవన్న గౌడ్, ఎంఈఓ చిరంజీవి రెడ్డి, పంచాయతీ రాజ్ జె ఈ చౌడారెడ్డి, మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా, చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మట్టుగూడలోని ఓం సాయి విద్యా నికేతన్ హై స్కూల్ విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, పోలీస్ స్టేషన్ పనితీరు, ఆధునిక పోలీసింగ్ విధానాలు మరియు ప్రజల భద్రత కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్ (ముఖ గుర్తింపు వ్యవస్థలు), సీసీటీవీ నిఘా వ్యవస్థ, వేలిముద్రల విశ్లేషణ, షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, పోర్టైయిట్ పార్లే మరియు బీట్ సిస్టమ్ వంటి ముఖ్యమైన పోలీసింగ్ విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించడం జరిగింది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నేరాల నివారణ, నేరస్తుల గుర్తింపు, నేర పరిశోధన మరియు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పోషిస్తున్న పాత్రను పోలీస్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్, సీసీటీవీ కెమెరాలు మరియు వేలిముద్రల విశ్లేషణ నేర పరిశోధనలో ఏ విధంగా ఉపయోగపడతాయో తెలియజేశారు.



మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్ మరియు భరోసా కేంద్రాలు అందించే సేవలు, రక్షణ మరియు సహాయ కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్, బీట్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావడం, ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించడం, స్థానికంగా భద్రతను మెరుగుపరచడం వంటి అంశాలను వివరించారు. నిందితుల గుర్తింపులో పోర్టైయిట్ పార్లే విధానం ఉపయోగాన్ని కూడా విద్యార్థులకు తెలియజేశారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ



విధులు, చట్టాల పట్ల గౌరవం, ప్రజా భద్రత, నేరాల నివారణలో సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించడం జరిగింది.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పోలీస్ శాఖ పనితీరుపై విలువైన అవగాహన పొందారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతానికి చిలకలగూడ పోలీస్ స్టేషన్ చేస్తున్న కృషిని తెలుసుకున్నారు.

ఎల్లమ్మ తల్లి ఆలయ షెడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు.

- బండి సంజయ్‌కు గౌడ సంఘం కృతజ్ఞతలు

- కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ బోనాల మణెమ్మ.

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టనున్న షెడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బోనాల మణెమ్మ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

ఎల్లమ్మ తల్లి ఆలయానికి వచ్చే భక్తులకు, ప్రత్యేక పూజలు నిర్వహించే సందర్భాల్లో ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా షెడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు, గౌడ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రం, బుగ్గారెడ్డి, బోనాల సాయికుమార్, నరేష్, పరశురాం, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వెంకటస్వామి, రంగయ్య, మల్లేశం, ఎల్లాగౌడ్, జవ్వాజి రాజు, పెద్ద మల్లేశం తదితర గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతు నేస్తం కార్యక్రమానికి ఆహ్వానం వంగూరు మండలం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

వంగూరు మండలంలోని రైతులకు,ఎఫ్.పి.ఓ.ప్రతినిధులకు, పి. ఏ. సి. ఎస్.సిబ్బంది మరియు సభ్యులకు, స్వయం సహాయక సంఘాల (ఎస్. జి. హెచ్. ఎస్) సభ్యులకు, అన్ని గ్రామాల సర్పంచులకు, వార్డు సభ్యులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు తెలియజేయునది ఏమనగా,

రేపు అనగా 27-10-2026 (మంగళవారం) ఉదయం 9:15 గంటలకులి రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో లివ్యవసాయ యాంత్రీకరణ (ఫార్మ్ మెకాన్సేషన్), కస్టమ్ హైరింగ్ సెంటర్లు (కస్టమర్ హిరింగ్ సెంటర్స్) మరియు రైతులకు వ్యవసాయ యంత్రాల లభ్యత, వినియోగం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుంది.

ఈ కార్యక్రమం క్రింది రైతు వేదికలలో నిర్వహించబడుతుంది:

1. వంగూరు రైతు వేదిక
2. రంగాపూర్ రైతు వేదిక
3. కొండారెడ్డిపల్లి రైతు వేదిక

కావున, పై పేర్కొన్న వారందరూ తమకు సమీపంలోని రైతు వేదికకు ఉదయం 9:15 గంటలకు చేరుకొని ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.

ఇట్లు,మండల వ్యవసాయ అధికారి,వంగూరు మండలం,నాగర్‌కర్నూల్ జిల్లా.

కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన బిసి నాయకులు



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

బహుజన యోధుడు పండుగ సాయన్న జయంతి ఉత్సవాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ. డి. లొ ఉన్న ముదిరాజ్ కులస్థులను బీసీ. ఏ. చేర్చే విషయాన్ని ప్రస్థావించడం జరిగినది. ఈవిషయాన్ని బీసీ. ఏ. హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో ఎ. ఓ. ప్రవీణ్ సార్ కు వినతి సమర్పించడం జరిగినది. ఇ సందర్భంగబీసీ. ఎ.కులాల హక్కుల పరిరక్షణ సమితి ఆదిలాబాద్ పార్లమెంట్ జిల్లా కన్వీనర్, సుంకేట. పోశెట్టి, బీసీ. ఎ. కులాల హక్కుల పరిరక్షణ సమితినిర్మల్ జిల్లా కన్వీనర్, తోకల. సరస్వతి, బైంసా డివిజన్ కన్వీనర్, హన్మాన్వారి. ప్రమీల, జిల్లా. నాయకులు తోకల. పోశెట్టి, పడిగేల. దేవేందర్, యు. శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఇసందర్భంగపలువురు వక్తలు మాట్లాడుతూ, బీసీ. ఎ. లొ ఇతర కులాలను చేర్చే ముందు, బీసీ. ఎ. లొ ఉన్న వాళ్ళను ఎస్. సి. ఎస్. టి. లొ చేర్చాలని డిమాండ్ చేశారు. మా సమస్యలు పరిస్కారం చేసిన తరువాత నె ఇతర కులాలను బీసీ. ఎ. లొ చేర్చే అంశం గురించి మాట్లాడలని అన్నారు. లేని యెడల భవిషత్తులో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాల్సివస్తుందని అన్నారు.

జగిత్యాల ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి..

45 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్...

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

)జగిత్యాల లో ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.



జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు ఈ సందర్భంగా మొత్తం 45 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించే వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

రావులపల్లిలోనే 30 పడకల ఆసుపత్రి నిర్మాణం

- ఆసుపత్రి మరో గ్రామానికి తరలిపోదు.. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- సానుకూల స్పందన త్వరలో స్థల పరిశీలనకు ఉన్నతస్థాయి అధికారులు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

మండల పరిధిలోని రావులపల్లి గ్రామానికి మంజూరైన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని అదే గ్రామంలో నిర్మించాలని కోరుతూ గ్రామ ప్రజల తరఫున ప్రతినిధులు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిశారు. జిల్లా కేంద్రమైన సూర్యాపేటలో కలెక్టర్‌ను కలిసి, ఆసుపత్రిని మరో గ్రామానికి కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా గ్రామానికి మంజూరైన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఇతర గ్రామానికి తరలించకుండా రావులపల్లిలోనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావాలంటే ఆసుపత్రి నిర్మాణం ఎంతో అవసరమని వివరించారు.అలాగే, గ్రామ ప్రజల తరఫున ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామసభలో ఆమోదించిన తీర్మానంతో పాటు గ్రామ ప్రజల సంతకాలు సేకరించిన పత్రాలను అధికారుల కు అందజేశారు.

ఆసుపత్రి విషయంలో గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, రావులపల్లి గ్రామానికి న్యాయం చేయాలని కోరారు.దీనిపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సానుకూలంగా స్పందించినట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు.రావులపల్లికి మంజూరైన 30 పడకల ఆసుపత్రి మరో గ్రామానికి వెళ్లదని, త్వరలో స్థల పరిశీలన కోసం ఉన్నతస్థాయి అధికారులు వస్తారని కలెక్టర్ తెలిపినట్లు వెల్లడించారు.గ్రామంలో ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే రావులపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని గ్రామస్థులు ఆశాభావం



వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు త్వరితగతిన స్థల పరిశీలన చేపట్టి, ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో రావులపల్లి గ్రామ సర్పంచ్ చింతకుంట్ల మనోజ్‌తో పాటు మునేష్, ఆదిత్య, అరుణ్, శ్రీకాంత్, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుమూసిన రాణి విజయమ్మ



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

పుంగనూరు జమీందారీ రాజవంశానికి చెందిన స్వర్గీయ రాజా ఉదయశంకర్ రాయల్ సతీమణి రాణి విజయమ్మ సోమవారం కన్నుమూశారు. రాణి విజయమ్మ మృతి వార్త తెలుసుకున్న పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, పట్టణ పెద్దలు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడి తమ ప్రగాఢ సానుభూతిని ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేశారు. రాణి విజయమ్మ ఆధ్వర్యంలో పుంగనూరులో ప్రసిద్ధి చెందిన శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరను ఎన్నో సంవత్సరాలుగా అత్యంత వైభవంగా ఆమె జరిపేవారు. అటువంటి ఆమె ఒకసారిగా ఇంక లేదు అని తెలుసుకున్న పుంగనూరు ప్రజలు బాధను వ్యక్తం చేశారు, ఆమె పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం మంగళవారం ఉదయం పుంగనూరు ప్యాలెస్‌లో ఉంచనున్నట్లు ఆమె కుమారుడు రాజా మల్లికార్జున రాయల్ తెలిపారు. అనంతరం ఉదయం 11 గంటల తర్వాత కుల సంప్రదాయం ప్రకారం తూర్పు మొగసాలల్లోని మఠం ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు

సీసీ నం. 5110/2026లో నలుగురు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన తెలంగాణ హైకోర్టు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

తెలంగాణ రాష్ట్ర గౌరవ హైకోర్టు, కోర్టు ధిక్కరణ కేసు నం 5110/2026 (సి .సి . నెంబర్) 5110/2026 లో లీవ్ పిటిషన్‌ను అనుమతించి, ప్రతిపాదిత కోర్టు ధిక్కరణదారులకు నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కరణకు సంబంధించిన ఆరోపణలపై తమ వివరణ సమర్పించాలని వారిని ఆదేశించింది.

ఈ కోర్టు ధిక్కరణ కేసు, పిటిషనర్ సస్పెన్షన్‌కు సంబంధించి గౌరవ హైకోర్టు, (డబ్ల్యూ .పి నెంబర్. 9084 ఆఫ్ 2025) లో కల్పించిన న్యాయపరమైన రక్షణను ఉల్లంఘించారనే మరియు న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల అమలుకు ఆటంకం కలిగించారనే ఆరోపణలకు సంబంధించినది.

గౌరవ హైకోర్టు 03.04.2025న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల ద్వారా పిటిషనర్ సస్పెన్షన్‌కు సంబంధించి ఉపశమనం కల్పించింది.

ఈ కేసులో ప్రతిపాదిత కోర్టు ధిక్కరణదారులు

1. కె. లింగయ్య మాజీ పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు (డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్)
2. బి. భిక్షపతి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)
3 పింగిలి శ్రీపాల్ రెడ్డి శాసనమండలి సభ్యులు
4. గుర్రం భద్రావతి

పిటిషనర్ చేసిన ఆరోపణల ప్రకారం, హైకోర్టు నుంచి న్యాయపరమైన రక్షణ లభించినప్పటికీ, సంబంధిత శాఖాపరమైన విచారణలో తదుపరి పరిణామాలు చోటుచేసుకున్నప్పటికీ, గతంలో వచ్చిన ఆరోపణలను తిరిగి తెరపైకి తెచ్చి, తనపై మరిన్ని శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి.

అలాగే, 21.03.2025 నుంచి 20.05.2025 వరకు ఉన్న సస్పెన్షన్ కాలాన్ని విధి నిర్వహణలో గడిపిన కాలంగా పరిగణించకుండా, 22.01.2026 నాటి ఉత్తర్వుల ద్వారా ఎలిజిబుల్ లీవ్ గా పరిగణించడాన్ని పిటిషనర్ సవాలు చేశారు. ఈ నిర్ణయం వల్ల తన సర్వీసు ప్రయోజనాలు, వార్షిక ఇంక్రిమెంట్లపై ప్రతికూల ప్రభావం పడిందని పిటిషనర్ పేర్కొన్నారు.

పిటిషనర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాజకీయ ప్రతినిధుల ద్వారా ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు, సంబంధిత ఇతర న్యాయపరమైన వ్యవహారాల్లో గతంలో జరిగిన న్యాయప్రక్రియలను వెల్లడించలేదనే ఆరోపణలు కూడా ఈ పిటిషన్‌లో ప్రస్తావించబడ్డాయి.లీవ్ పిటిషన్‌ను అనుమతించి నోటీసులు జారీ చేయడం ద్వారా గౌరవ హైకోర్టు ఈ వ్యవహారాన్ని తదుపరి విచారణకు స్వీకరించింది. అయితే, పిటిషన్‌లో చేసిన ఆరోపణలపై తుది నిర్ణయం ఇంకా వెలువడలేదు. ప్రతివాదులకు తమ వివరణను సమర్పించుకునే అవకాశం ఉంటుంది.ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది గుర్రం వెంకటరమణ మాట్లాడుతూ... న్యాయస్థానాల ఆదేశాల గౌరవాన్ని కాపాడటం, వాటిని చట్టప్రకారం అమలు చేయించడం ఈ న్యాయప్రక్రియ యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కోర్టు ముందు సమర్పించిన వాస్తవాలు, రికార్డులు మరియు చట్టపరమైన అంశాలను పరిశీలించి తగిన న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వాల్మీకి జీవితం సమాజానికి స్ఫూర్తిదాయకం చెన్నకేశవ

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

రామసముద్రం మండల కేంద్రంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనప్పల్లె కొత్తూరు చెన్నకేశవ శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు, ఆయన మాట్లాడుతూ వాల్మీకి జీవితం, ఆదర్శాలు, ఆయన రచించిన రామాయణం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమన్నారు. వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. ఆయన జీవితం మనిషిలో మార్పు సాధ్యమేనని, పట్టుదల, జ్ఞానం, నిరంతర కృషితో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని చాటిచెబుతుందన్నారు. వాల్మీకి బోధనలను ఆచరిస్తూ సమాజంలో సద్భావన, సమానత్వం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని చెన్నకేశవ సూచించారు.



మాసాయిపేట్ మండల్ సోమవారం ప్రజావాణిలో రెండు దరఖాస్తులు

- 26 సోమవారం రెండు దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో. ఎంపీ ఓ తెలిపారు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం (26.10.2026) మాసాయిపేట్ మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో. ఎంపీ ఓ. తో పాటు మండల స్థాయి అధికారులందరూ పాల్గొన్నారు!

1. భూమికి దారి కోసం రైతు వినతి:
హకింపేట గ్రామానికి చెందిన నీరుడు కుమార్ తండ్రి పోచయ్య తనకు చెందిన సర్వే నెంబర్ 70 లో గల మూడు ఎకరాల 15 గుంటల భూమికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో, దారి ఏర్పాటు చేసి ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

2. ఫార్మా కంపెనీ నిలుపుదల చేయాలని గ్రామస్థుల వినతి:
మాసాయిపేట్ మండల్ పోతన శెట్టిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న హెపాల్ లైఫ్ సైన్సెస్





కంపెనీ నిలుపుదల చేయాలని గ్రామ ప్రజలు వినతి పత్రం సమర్పించారు. ఈ కంపెనీ వల్ల భూగర్భ జలాలు కలుషితమై, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని, అందువల్ల ఈ కంపెనీ అనుమతులను రద్దు చేసి నిలుపుదల చేయాలని వారు కోరుతున్నారు.
అధికారులు రెండు వినతులను స్వీకరించి, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మొలగవల్లి, కొట్టాలలో టీడీపీ ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఆలూరు మండలం పరిధిలోని మొలగవల్లి కొట్టాల గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల ప్రచారాన్ని టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి శివప్రసాద్, ఎంపీపీ అభ్యర్థి సాయి శ్రీరామ్, సాయి దినేష్, అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూస్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టామన్నారు.
ఈ సందర్భంగా మండల కన్వీనర్ కటారి కొండ శ్రీనివాసులు, పార్టీ నాయకులు జెకె రెహమాన్, క్లస్టర్ ఇంచార్జ్ జీకే షేక్షావలి, సింగల్ విండో చైర్మన్ ఈ రప్ప, క్లస్టర్ కోకన్వీనర్ సోమశేఖర్, యూనిట్ అధ్యక్షులు షేక్షావలి, జిల్లా నాయకులు అశోక్ యాదవ్, మోక మల్లయ్య, డీలర్ వెంకటేశ్వర్లు, గోపాల్, మాల నరసింహులు, మొలగవల్లి కొట్టాల ఎంపిటిసి అభ్యర్థి శ్రీమతికీర్తి, డీలర్ రామాంజనేయులు,ఎన్ ప్రహ్లాద్, ఎన్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రాజశేఖర్, తిరుమల రామన్న, మొలగవల్లి జయచంద్ర, ఆలూరు కిరణ్, క్రాంతి,శాంత రాజు, ఆశీర్వాదం, రేకుల బొజ్జప్ప, వండ్రప్ప,ఎర్రి స్వామి, పల్లి ఆనందు, కర్ణాంజనేయులు, తిరుమల జోజి ఐ టి డి పి జయరాజు, కొలిమి రామయ్య, సోమన్న, విజయ్ కుమార్, గడేకల్ కుమార్, రామదాసు, పి రామయ్య, ఎన్. అర్లయ్య, తదితర పార్టీ శ్రేణులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేపట్టారు. ప్రజల వద్దకు వెళ్లి టీడీపీ విధానాలను,6 ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ పార్టీ అభ్యర్థులకు మద్దతు కూడగట్టాలని సూచించారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వైకుంఠం జ్యోతి శివప్రసాద్ పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయాలని పేర్కొన్నారు.







మొలగవల్లి కొట్టాల గ్రామాల్లో ప్రారంభమైన ఈ ప్రచారంతో టీడీపీ శ్రేణుల్లో ఎన్నికల సందడి నెలకొంది. రానున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం ఏంటి? ఇది రాజ్యాంగంపై దాడి కాదా?

- ఆల్ ఇండియా ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ చైర్మన్ : వంగూరు జయశంకర్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ప్రజల ఓట్లతో ఎన్నికలు జరగాలి బెదిరింపులతో ఏకగ్రీవాలు కాదు టిడిపి వైఖరి పై తెలంగాణ గళం....! ఆంధ్రప్రదేశ్ లోజరుగుతున్న అరాచకంపై ఆల్ ఇండియా ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ చైర్మన్ వంగూరి జయశంకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
"నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం ఏంటి? ఇది ఆంధ్ర రాజకీయమా, రాజ్యాంగబద్ధమా అని ఆయన ప్రశ్నించారు.
గురువారం మీడియాతో వంగూరు జయశంకర్ మాట్లాడుతూ "రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు ప్రజలు వేసే ఓట్ల ద్వారా నిర్ణయించబడతాయి. ప్రజలే తీర్పు ఇవ్వాలి. కానీ ఇక్కడ బెదిరించి, దాడులు చేసి, బలవంతంగా ఏకగ్రీవాలు చేయడం సరైనది కాదు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే" అని అన్నారు.
టీడీపీ ప్రభుత్వ తీరుపై ఫైర్ అయ్యారు.అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం వైయస్సార్ పార్టీ నేతలపై చెయ్యి చేసుకోవడం, మాజీ మంత్రులను గృహ నిర్బంధం చేయడం, బీ-ఫారాలు బ్లాక్ చేయడం సరైనది కాదు.రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని జయశంకర్ అన్నారు.
అన్ని పార్టీలకు, అందరికీ నామినేషన్లు వేసే హక్కు ఉంది. ఆ హక్కును కాలరాయడం అంటే రాజ్యాంగాన్ని కాలరాయడమే, రాజ్యాంగం మీద ప్రమాణం చేసి, రాజ్యాంగాన్నే చంపే ప్రయత్నం చేస్తున్నార మీ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది ముమ్మాటికీ తప్పు అని ఆయన హెచ్చరించారు.
ఆంధ్రాలో జరుగుతున్నది చూస్తే తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన అణచివేత గుర్తొస్తోంది. తెలంగాణ సమాజం దీన్ని ఖండిస్తోంది. రాజ్యాంగాన్ని కాపాడాలి, ప్రజల



ఓట్లకు విలువ ఇవ్వాలి అని వంగూరి జయశంకర్ అన్నారు.

ఆలూరులో ఘనంగా శ్రీశ్రీ వాల్మీకి జయంతి వేడుకలు.





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఆలూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వాల్మీకి సోదరులు శ్రీశ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గంలో నడవాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మొలగవల్లి రామాంజనేయులు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు గొప్ప మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజంలో సత్యం, ధర్మం, న్యాయం, మానవతా విలువలను పెంపొందించడంలో వాల్మీకి మహర్షి బోధనలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని తెలిపారు.
వాల్మీకి సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విద్య, సామాజిక చైతన్యం, ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వాల్మీకి మహర్షి జీవిత సందేశాలను యువతకు తెలియజేస్తూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.
ఈ జయంతి వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అరికెర వెంకటేశ్వర్లు, మరకట్టు యల్లప్ప, భాస్కర్, కురవల్లి శివ, వరుణ్ కుమార్, నాగేంద్ర, వీరేష్, నాగరాజు, ఈరన్న, తదితరవాల్మీకి సోదరులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబితాపూర్ గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

జగిత్యాల జిల్లా జాబితాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొన్నారు.
గ్రామీణ పరిపాలనకు గ్రామ పంచాయతీ భవనం కీలకమని, గ్రామ ప్రజలకు స్థానిక పాలన సేవలు మరింత చేరువ కావడానికి ఇటువంటి భవనాలు దోహదపడతాయని పేర్కొన్నారు.
గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజల సమస్యలను పరిష్కరించాలి శానిటేషన్ త్రాగునీరు మౌలిక సదుపాయాలు ప్రధానం అన్నారు ఏ సమస్య ఉన్న గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండాలి అని సర్పంచ్ మహేష్ కి వారి పాలక మండలికి సూచించారు
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞాన పోటీల్లో పాములపాడు శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థి పి.దిలీషా ప్రతిభ

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

నంద్యాల జిల్లా, పాములపాడు గ్రామానికి చెందిన శ్రీ వివేకానంద విద్యా విహార్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.దిలీషా అంతరిక్ష విజ్ఞానానికి స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి గుర్తింపు తెచ్చిందని కరస్పాండెంట్ ఆర్ ఎస్ ఆర్. గోపాల్ తెలిపారు.
ఈ సందర్భంగా శ్రీ వివేకానంద విద్యావిహార్ హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్. గోపాల్ మాట్లాడుతూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఇస్రో శ్రీహరికోటలోని, సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా సెప్టెంబర్-28వ తేదీన నిర్వహించిన పోటీల్లో దిలీషా పాల్గొనడం జరిగిందని అన్నారు. రాకెట్ టూ ఏ థౌసండ్ వరల్డ్స్ , స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అంశాలకు సంబంధించిన పోటీల్లో మండల స్థాయిలో విజేతగా నిలిచి, జిల్లా స్థాయికి ఎంపికైందనీ తెలిపారు.
విద్యార్థినికి నెల్లూరు జిల్లాలోని, శ్రీహరికోట స్పేస్ సెంటర్ ఇస్రో జారీ చేసిన ప్రశంసా పత్రంతో పాటు, చిత్రపటాన్ని అందజేయడం జరిగిందన్నారు. బాల్యం నుంచే విద్యార్థులు అంతరిక్షం, సైన్స్, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. శాస్త్రీయ దృక్పథం,



సృజనాత్మకత, పరిశీలనా శక్తిని అలవర్చుకున్నప్పుడే భవిష్యత్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోగలరని పేర్కొన్నారు. క్విజ్ వంటి పోటీల్లో ప్రతిభ చాటిన దిలీషా ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని ఆయన అభినందించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా అంతరిక్ష పరిశోధనలు, శాస్త్రీయ ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధిపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థిని దిలీషాను శ్రీ వివేకానంద విద్యా విహార్ హైస్కూల్ డైరెక్టర్ రాయపాటి దేవిక, ఉపాధ్యాయులు బాలకృష్ణమ్మ, షాజహాన్, సురేంద్ర, నారాయణ, స్కూల్ సిబ్బంది అభినందించారు. ఇలాంటి విజయాలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో శాస్త్రసాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంచుతాయని పేర్కొన్నారు.

మొలగవల్లి, కొట్టాలలో టీడీపీ ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఆలూరు మండలం పరిధిలోని మొలగవల్లి కొట్టాల గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల ప్రచారాన్ని టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి శివప్రసాద్, ఎంపీపీ అభ్యర్థి సాయి శ్రీరామ్, సాయి దినేష్, అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూస్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టామన్నారు.
ఈ సందర్భంగా మండల కన్వీనర్ కటారి కొండ శ్రీనివాసులు, పార్టీ నాయకులు జెకె రెహమాన్, క్లస్టర్ ఇంచార్జ్ జీకే షేక్షావలి, సింగల్ విండో చైర్మన్ ఈ రప్ప, క్లస్టర్ కోకన్వీనర్ సోమశేఖర్, యూనిట్ అధ్యక్షులు షేక్షావలి, జిల్లా నాయకులు అశోక్ యాదవ్, మోక మల్లయ్య, డీలర్ వెంకటేశ్వర్లు, గోపాల్, మాల నరసింహులు, మొలగవల్లి కొట్టాల ఎంపిటిసి అభ్యర్థి శ్రీమతికీర్తి, డీలర్ రామాంజనేయులు,ఎన్ ప్రహ్లాద్, ఎన్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రాజశేఖర్, తిరుమల రామన్న, మొలగవల్లి జయచంద్ర, ఆలూరు కిరణ్, క్రాంతి,శాంత రాజు, ఆశీర్వాదం, రేకుల బొజ్జప్ప, వండ్రప్ప,ఎర్రి స్వామి, పల్లి ఆనందు, కర్ణాంజనేయులు, తిరుమల జోజి ఐ టి డి పి జయరాజు, కొలిమి రామయ్య, సోమన్న, విజయ్ కుమార్, గడేకల్ కుమార్, రామదాసు, పి రామయ్య, ఎన్. అర్లయ్య, తదితర పార్టీ శ్రేణులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేపట్టారు. ప్రజల వద్దకు వెళ్లి టీడీపీ విధానాలను,6 ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ పార్టీ అభ్యర్థులకు మద్దతు కూడగట్టాలని సూచించారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వైకుంఠం జ్యోతి శివప్రసాద్ పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయాలని పేర్కొన్నారు.
మొలగవల్లి కొట్టాల గ్రామాల్లో ప్రారంభమైన ఈ ప్రచారంతో టీడీపీ శ్రేణుల్లో ఎన్నికల సందడి నెలకొంది. రానున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పూలకుంటపల్లి ఎంపీటీసీ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా చింతా శరత్ కుమార్ రెడ్డి బీఫామ్ అందజేత

- ఎన్ డి ఏకూటమి సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ పూలకుంటపల్లిలో బిజెపి జెండా ఎగరవేస్తాం
- ప్రజల్లోకి సమక్షేమ పథకాలు తీసుకెళ్లి విజయం సాధిస్తాం: చింతా శరత్ కుమార్ రెడ్డి పిలుపు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

పుట్టపర్తి నియోజకవర్గం అమడగూరు మండలం లోనే పులుకుంటపల్లి గ్రామ పంచాయతీ ఎంపిటిసి స్థానానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తరపున నామినేషన్ దాఖలు చేసిన
చింతా శరత్ కుమార్ రెడ్డి సోమవారం బీఫామ్ను తీసుకున్నారు
ఈ సందర్భంగా ఆయన చింత శరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని
బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు
ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం
అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తామని తెలిపారు
ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేస్తామని స్పష్టం చేశారు
తనపై నమ్మకం ఉంచి బీజేపీ తరపున బీఫామ్ అందించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా





చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్
రాష్ట్ర మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు శ్రీ జి.ఎం. శేఖర్
మాజీ ఎంపీ శ్రీ పార్థసారథిఆల్ సెల్స్ కోఆర్డినేటర్ శ్రీ సోము గుట్ట విష్ణువర్ధన్ రెడ్డి
పుట్టపర్తి నియోజకవర్గంఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి శ్రీ పల్లె రఘునాథ్ రెడ్డి
అమడగూరు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ ఓ గోపాల్ రెడ్డి మాజీ జడ్పిటిసి ఎంపీపీ
పి శ్రీనివాస్ రెడ్డి అమడగూరు మండల తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి కూటమి అందరి సహకారంతో బిజెపికి సహకరించిన అందరికీ ప్రత్యేక తదితర కూటమి నాయకులకు చింతా శరత్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు
ఆమడగూరుమండలంలోనిపులుకుంటపల్లి ఎంపీటీసీ స్థానంలో తప్పకుండా విజయం సాధించి తనపై నమ్మకంతో పార్టీ అందించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తాననిఆయన ధీమా వ్యక్తం చేశారు
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారి మద్దతుతో ఎన్నికల్లో గెలుపొందేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజల్లో తమకు మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు
ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ మూడే హరీ నాయక్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీ మేకల శ్రీనివాసులు, మండల అధ్యక్షులు శ్రీ రామిశెట్టి వేమనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ ఇందుకూరి సురేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీ సుబ్బిరెడ్డి, శ్రీ ఐ. రాము, మండల అధ్యక్షులు శ్రీ విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవాళి ఆరోగ్య సవాళ్లకు వైద్య పరిశోధనలే పరిష్కారం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ రూబీ జూబ్లీ వేడుకల్లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



మానవాళి ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లకు పరిష్కారాలు కనుగొనే దిశగా వైద్య సంస్థలు పరిశోధనలను బలోపేతం చేయాలని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ అత్యవసర ఆరోగ్య సమస్యలకు సమర్థమైన పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ 40వ వార్షికోత్సవం--రూబీ జూబ్లీ వేడుకల్లో ఆయన ప్రసంగించారు.డాక్టర్ఎన్టీఆర్ భారతదేశం గర్వించదగిన మహనీయుడని ఉపరాష్ట్రపతి కొనియాడారు. ప్రాంతీయ సరిహద్దులకు అతీతంగా ఆలోచించిన నాయకుడిగా ఆయనను అభివర్ణించారు.

సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి సేవ చేయాలని, వైద్య సేవలకు కరుణే ప్రధాన ఆధారమని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సమాజం సాగించే పోరాటంలో వైద్యులు ముందుండి నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.

ఫిలిప్పీన్స్‌లో ఏడీఎంఎం--ప్లస్ సమావేశాలకు రాజ్‌నాథ్ సింగ్

ఈ నెల 28, 29 తేదీల్లో సెబూలో సదస్సు.. ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతపై చర్చలు

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఫిలిప్పీన్స్‌లోని సెబూ నగరంలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న 13వ ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం--ప్లస్ (ఏడీఎంఎం--ప్లస్)లో భారత ప్రతినిధి బృందానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వం వహించనున్నారు. 'ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా అంశాలపై అభిప్రాయాల మార్పిడి' అంశంపై ఆయన ప్రసంగించనున్నారు.

సదస్సు సందర్భంగా పాల్గొనే దేశాల రక్షణ మంత్రులతో రాజ్‌నాథ్ సింగ్ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా దేశాలతో కొనసాగుతున్న రక్షణ సంబంధాలను సమీక్షించడంతోపాటు వ్యూహాత్మక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసే అవకాశాలపై చర్చించనున్నారు.ఆసియాన్‌లో రక్షణ రంగ సంప్రదింపులు, సహకారానికి ఏడీఎంఎం అత్యున్నత వేదికగా ఉంది. ఆసియాన్ సభ్యదేశాలతోపాటు భారత్, అమెరికా, చైనా, రష్యా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల మధ్య భద్రత, రక్షణ సహకారాన్ని పెంపొందించేందుకు ఏడీఎంఎం--ప్లస్ పనిచేస్తోంది.భారత్ 1992లో ఆసియాన్ చర్చల భాగస్వామిగా చేరింది. తొలి ఏడీఎంఎం--ప్లస్ సమావేశం 2010 అక్టోబర్ 12న వియత్నాంలోని హనోయ్‌లో జరిగింది. 2017 నుంచి సభ్యదేశాల రక్షణ మంత్రులు ఏటా సమావేశమై రక్షణ సహకారాన్ని బలోపేతం చేసేందుకు చర్చిస్తున్నారు.

2026 సంవత్సరానికి ఫిలిప్పీన్స్ ఏడీఎంఎం--ప్లస్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోంది. ఈ వేదిక పరిధిలో 2024--2027 కాలానికి ఉగ్రవాద నిరోధక నిపుణుల కార్యబృందానికి మలేసియాతో కలిసి భారత్ సహాధ్యక్షత వహిస్తోంది. 'యాక్ట్ ఈస్ట్' విధానంలో భాగంగా ఆగ్నేయాసియా దేశాలతో రక్షణ సంబంధాలను విస్తరిస్తూ, ప్రాంతీయ శాంతి, సుస్థిరత, సమష్టి అభివృద్ధికి భారత్ ప్రాధాన్యమిస్తోంది.ఖ


టెలికాం పెన్షనర్లకు నవంబర్‌లో జీవన్ ప్రమాణ్ శిబిరాలు

ఢిల్లీ--ఎన్‌సీఆర్‌లో జీవన ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

టెలికాం పెన్షనర్ల సౌకర్యార్థం నవంబర్ నెలలో ఢిల్లీ--ఎన్‌సీఆర్ పరిధిలో జీవన్ ప్రమాణ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు టెలికమ్యూనికేషన్ల శాఖ పరిధిలోని ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయం వెల్లడించింది. ఈ శిబిరాల్లో పెన్షనర్ల జీవన ధ్రువపత్రాలను అక్కడికక్కడే పరిశీలించే సదుపాయం కల్పించనున్నారు.న్యూఢిల్లీలోని



ప్రసాద్‌నగర్‌లో ఉన్న ఢిల్లీ సంచార్ లేఖా భవన్‌లోని ప్రిన్సిపల్ సీసీఏ కార్యాలయం, జన్‌పథ్‌లోని ఈస్టర్న్ కోర్ట్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌తోపాటు ఢిల్లీ--ఎన్‌సీఆర్‌లోని వివిధ ఎంటీఎన్ఎల్ ప్రాంగణాల్లో ఈ శిబిరాలు జరగనున్నాయి. పెన్షనర్లు తమకు అనుకూలమైన ప్రదేశంలోని శిబిరానికి సంబంధిత పత్రాలతో హాజరై, జీవన ధ్రువపత్రాల పరిశీలన సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

వృథాపై జలమండలి కొరడా..?

ప్యారడైజ్ హోటల్‌కు రూ.20 వేల జరిమానా..!!



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

తాగునీటిని దుర్వినియోగం చేసినందుకు సికింద్రాబాద్ హోటల్ ప్యారడైజ్ యాజమాన్యానికి జలమండలి రూ.20 వేల జరిమానా విధించింది.ఖైరతాబాద్ జోన్ పరిధిలోని డివిజన్-16 అధికారులు నిర్వహించిన తనిఖీల్లో హోటల్ ప్యారడైజ్‌లో (జూచీ నంబర్: 612182839) నీటి దుర్వినియోగాన్ని గుర్తించారు. దీంతో రూ.20 వేల జరిమానా విధించడంతో పాటు భవిష్యత్తులో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని యాజమాన్యానికి సూచించారు. నీటి దుర్వినియోగానికి పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని జలమండలి అధికారులు హెచ్చరించారు.

హైదరాబాద్ నగరవాసులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరవాసులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు ఎదురుచూస్తున్న అందించింది. సుదీర్ఘ కాలంగా హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలకు కేంద్రం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76 కిలోమీటర్ల మేర ఐదు కొత్త కారిడార్లలో ఈ నిర్మాణ పనులను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మెట్రో ఫేజ్-2 పనులను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే నాగోల్- ఎయిర్‌పోర్ట్(ఎయిర్‌పోర్ట్ కారిడార్) మార్గంతో ముందుగా ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టును 2029 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

ట్రైనెట్ న్యూస్ సికింద్రాబాద్అక్టోబర్26/10/2026





పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా, చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మట్టుగూడలోని ఓం సాయి విద్యా నికేతన్ హై స్కూల్ విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, పోలీస్ స్టేషన్ పనితీరు, ఆధునిక పోలీసింగ్ విధానాలు మరియు ప్రజల భద్రత కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్ (ముఖ గుర్తింపు వ్యవస్థలు), సీసీటీవీ నిఘా వ్యవస్థ, వేలిముద్రల విశ్లేషణ, షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, పోర్టెయిట్ పార్లే మరియు బీట్ సిస్టమ్ వంటి ముఖ్యమైన పోలీసింగ్ విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించడం జరిగింది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నేరాల నివారణ, నేరస్తుల గుర్తింపు, నేర పరిశోధన మరియు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పోషిస్తున్న పాత్రను పోలీస్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్, సీసీటీవీ కెమెరాలు మరియు వేలిముద్రల విశ్లేషణ నేర పరిశోధనలో ఏ విధంగా ఉపయోగపడతాయో తెలియజేశారు.

మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్ మరియు భరోసా కేంద్రాలు అందించే సేవలు, రక్షణ మరియు సహాయ కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్, బీట్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావడం, ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించడం, స్థానికంగా భద్రతను మెరుగుపరచడం వంటి అంశాలను వివరించారు. నిందితుల గుర్తింపులో పోర్టెయిట్ పార్లే విధానం ఉపయోగాన్ని కూడా విద్యార్థులకు తెలియజేశారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, చట్టాల పట్ల గౌరవం, ప్రజా భద్రత, నేరాల నివారణలో సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించడం జరిగింది.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పోలీస్ శాఖ పనితీరుపై విలువైన అవగాహన పొందారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతానికి చిలకలగూడ పోలీస్ స్టేషన్ చేస్తున్న కృషిని తెలుసుకున్నారు.

భవిష్యత్ యుద్ధాలకు సన్నద్ధంగా సైనిక వ్యవస్థల ఆధునికీకరణ డిసెంబర్ 14, 15 తేదీల్లో చండీమందిర్‌లో

మెకనైజేషన్ టెక్నాలజీ సెమినార్ ఢిల్లీలో సన్నాహక కార్యక్రమాన్ని ప్రారంభించిన లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



ప్రస్తుత సైనిక వాహనాలు, యుద్ధ వ్యవస్థలను అధునాతన సాంకేతికతతో ఆధునికీకరించి, భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పశ్చిమ కమాండ్ ఆధ్వర్యంలో మెకనైజేషన్ టెక్నాలజీ సెమినార్--2.0 నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన సన్నాహక కార్యక్రమాన్ని సోమవారం న్యూఢిల్లీలోని మానెక్‌షా సెంటర్‌లో పశ్చిమ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్--ఇన్--చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్ ప్రారంభించారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.

'చక్ర--భవిష్యత్ పోరాటాల కోసం ప్రస్తుత యుద్ధ వ్యవస్థల పరివర్తన' ఇతివృత్తంతో డిసెంబర్ 14, 15 తేదీల్లో చండీమందిర్ మిలిటరీ స్టేషన్‌లో ప్రధాన సదస్సు జరగనుంది. భారత సైన్యం, రక్షణ పరిశ్రమలు, విద్యా--పరిశోధన సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొని యాంత్రీకృత దళాల సామర్థ్యాల పెంపు,సాంకేతిక పురోగతిపై చర్చించనున్నారు.పోరాట సామర్థ్యం పెంపు, సాంకేతిక వినియోగం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవస్థల మార్పు, దాడి సామర్థ్యం, పునరుద్ధరణ, రక్షణ రంగంలో స్వావలంబన వంటి అంశాలపై సదస్సు దృష్టి సారించనుంది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సామర్థ్య లోటుపాట్లు, అవసరాలను స్పష్టమైన సమస్య నిర్వచన పత్రాలుగా రూపొందించి, వాటికి ఆచరణ సాధ్యమైన సాంకేతిక పరిష్కారాలను గుర్తించనున్నారు.

సన్నాహక కార్యక్రమంలో సదస్సు లక్ష్యాలు, ప్రధాన చర్చనీయాంశాలను వివరించారు. సాంకేతిక ఆధారిత ఆధునికీకరణ, పౌర--సైనిక భాగస్వామ్యం, దేశీయ రక్షణ సామర్థ్యాల బలోపేతంలో ఆత్మనిర్భరత ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. ప్రస్తుత యుద్ధ వ్యవస్థల ఆధునికీకరణ, స్వదేశీ ఆవిష్కరణలు, కొత్త కార్యాచరణ అవసరాలపై సైనిక అధికారులు, పరిశ్రమలు, విద్యా సంస్థల ప్రతినిధులు అభిప్రాయాలు పంచుకున్నారు.

మారుతున్న యుద్ధక్షేత్ర పరిస్థితుల్లో యాంత్రీకృత దళాల కార్యాచరణ సామర్థ్యం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే శక్తి, పోరాట సన్నద్ధతను పెంచేందుకు ఈ సదస్సు దోహదపడనుంది. సాయుధ దళాలు, రక్షణ పరిశ్రమలు, విద్యా సంస్థల సమన్వయంతో సైనిక అవసరాలను అమలు చేయగల సాంకేతిక పరిష్కారాలుగా మలచడం దీని ప్రధాన ఉద్దేశం.

పాఠశాల విద్య నుంచి ఉపాధి వరకు పటిష్ఠ అనుసంధానం ఢిల్లీలో సీబీఎస్ఈ నాలుగో జాతీయ సదస్సు విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాల సమన్వయంపై కార్యదర్శి టీ.కె. అనిల్‌కుమార్ దృష్టి

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



పాఠశాల విద్యను ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలతో అనుసంధానించాలని కేంద్ర పాఠశాల విద్య--అక్షరాస్యత శాఖ కార్యదర్శి టి.కె. అనిల్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తుపై అవగాహనతో నిర్ణయాలు తీసుకునేలా విద్యావ్యవస్థ తోడ్పడాలని సూచించారు. 'పాఠశాల నుంచి ఉద్యోగ ప్రపంచంలోకి సులభ పరివర్తన' అంశంపై సోమవారం న్యూఢిల్లీలో ప్రారంభమైన సీబీఎస్ఈ నాలుగో జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు.

ఢిల్లీ--ఎన్‌సీఆర్ సహోదయ స్కూల్ కాంప్లెక్స్‌ల సహకారంతో కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) అక్టోబర్ 26, 27 తేదీల్లో ఈ సదస్సును నిర్వహిస్తోంది. కార్యక్రమంలో సీబీఎస్ఈ చైర్మన్ డాక్టర్ మన్‌దీప్ భండారీతో పాటు కేంద్ర విద్యాశాఖ, సీబీఎస్ఈ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సదస్సుకు సంబంధించి నాలుగు ప్రధాన ప్రాధాన్యాలను అనిల్‌కుమార్ వివరించారు. సాంకేతికత, డిజిటల్ భద్రత--నైపుణ్యాలు; డిజైన్, సృజనాత్మకత--ఆవిష్కరణలు; జాతీయ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా వివిధ విద్యావ్యవస్థల్లో నైపుణ్యాలకు గుర్తింపు; సమాన అవకాశాలతో కూడిన కెరీర్ మార్గదర్శకత్వం కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం ఎదుగుతూ, సమాజానికి దోహదపడుతూ, గౌరవప్రదంగా జీవించేందుకు విద్య పునాది కావాలని ఆకాంక్షించారు.

ప్రధాన విద్యాబోధనలో నైపుణ్య విద్యను మరింతగా భాగం చేయడం, విద్యార్థులు పాఠశాలల నుంచి ఉద్యోగ ప్రపంచంలోకి సులభంగా అడుగుపెట్టేలా సిద్ధం చేయడం ఈ రెండు రోజుల సదస్సు లక్ష్యం. పాఠశాలల అధిపతులు, ఉపాధ్యాయులు, పరిశ్రమల నిపుణులు, విధాన రూపకర్తలు భవిష్యత్ ఉద్యోగాలకు అవసరమైన సామర్థ్యాలు, విద్యార్థులను తీర్చిదిద్దే వినూత్న విధానాలపై చర్చిస్తున్నారు.

జాతీయ విద్యా విధానం--2020 ఆశయాలకు అనుగుణంగా వివిధ విద్యా విభాగాల మధ్య అడ్డంకులను తొలగించి, మారుతున్న ఉపాధి రంగానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడంపై సదస్సు దృష్టి సారిస్తోంది. వినూత్న బోధనా పద్ధతులు, నూతన మూల్యాంకన విధానాలు, విద్యలో డిజిటల్ సాంకేతిక వినియోగంపై ముఖాముఖి సమావేశాలు, నిపుణుల చర్చలు నిర్వహిస్తున్నారు.

సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల ఉపాధ్యాయులు నైపుణ్య విద్యలో విజయవంతమైన అనుభవాలు, ఉత్తమ విధానాలను అధ్యయన పత్రాలు, పోస్టర్ల రూపంలో ప్రదర్శిస్తున్నారు. బోధన--అభ్యసన ప్రక్రియలను మెరుగుపరిచే ఆచరణాత్మక వ్యూహాలను పంచుకోవడంతో పాటు పరస్పర మార్గదర్శకత్వం, భాగస్వామ్యాలకు సదస్సు వేదికగా నిలుస్తోంది.

జీవ సాంకేతిక రంగంలో ప్రపంచ నాయకత్వం దిశగా భారత్ పరిశోధన ఫలితాలను ప్రజలకు ఉపయోగపడే పరిష్కారాలుగా మార్చాలి ఐసీజీఈబీలో ఎస్టిక్--2026 సన్నాహక కార్యక్రమం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

శాస్త్రీయ పరిశోధనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచడం ద్వారా జీవ సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచ నాయకత్వ స్థానానికి ఎదగగలదని నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ గోవర్ధన్ దాస్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ జెనెటిక్ ఇంజినీరింగ్ అండ్ బయోటెక్నాలజీ (ఐసీజీఈబీ)లో నిర్వహించిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఎస్టిక్--2026) సన్నాహక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.భారత్‌లో పెరుగుతున్న శాస్త్రీయ సామర్థ్యాలు దేశాభివృద్ధికి, ఆవిష్కరణల వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతున్నాయని గోవర్ధన్ దాస్ తెలిపారు. మౌలిక జీవశాస్త్ర పరిశోధనలు ప్రాణాలను కాపాడే ఆవిష్కరణలకు మార్గం చూపుతాయని, కొవిడ్--19 వ్యాక్సిన్ల అభివృద్ధి ఇందుకు ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్తగా ఎదురవుతున్న అంతర్జాతీయ సవాళ్లను పరిష్కరించడంలో బయోటెక్నాలజీ కీలక పాత్ర పోషించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.

కేంద్ర బయోటెక్నాలజీ శాఖ కార్యదర్శి డాక్టర్ రాజేష్ ఎస్. గోఖలే మాట్లాడుతూ.. శాస్త్రీయ ఆవిష్కరణలను విస్తృత స్థాయిలో ఉత్పత్తి చేసి సమాజానికి అందుబాటులోకి తీసుకొచ్చినప్పుడే వాటి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పెన్సిలిన్ ఆవిష్కరణ, భారీ స్థాయి ఉత్పత్తిని ఇందుకు ఉదాహరణగా వివరించారు. బయోటెక్నాలజీ రెండో విప్లవ దశలోకి అడుగుపెడుతోందని, ప్రయోగశాలల్లోని పరిశోధనలను ఆచరణలోకి తీసుకురావడానికి పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి విస్తరణను బలోపేతం చేయాలని సూచించారు.

కార్యక్రమంలో సిస్టమ్స్ అండ్ సింథటిక్ బయాలజీపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంక్లిష్ట జీవ వ్యవస్థలను అర్థం చేసుకోవడం, అవసరాలకు అనుగుణంగా జీవ ప్రక్రియలను రూపొందించడం ద్వారా వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక బయోటెక్నాలజీ, సుస్థిర అభివృద్ధి రంగాల్లో సాధించగల పురోగతిపై చర్చించారు.

బయోటెక్నాలజీ శాఖ సైంటిస్ట్--హెచ్, బైరాక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనంజయ్‌కుమార్ తివారీ మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ, జీవ ఆధారిత తయారీ, బయోడిజైన్ రంగాల్లో ఈ సాంకేతికతలకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. జీవశాస్త్ర పరిశోధనలను వేగవంతం చేయడంలో కృత్రిమ మేధ ప్రాధాన్యాన్ని వివరించారు. బయోఈ3 విధానం భారత బయోటెక్నాలజీ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించగలదని పేర్కొన్నారు.

ఐసీజీఈబీ న్యూఢిల్లీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ వి. సోంటి ఎస్టిక్--2026 లక్ష్యాలను వివరించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న ఈ సదస్సులో బయోటెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో 'సిస్టమ్స్ అండ్ సింథటిక్ బయాలజీ'పై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జీవనంలోని దాదాపు ప్రతి అంశాన్ని ప్రభావితం చేసే ఈ రంగాలు శాస్త్రీయ పురోగతికి విస్తృత అవకాశాలను అందిస్తున్నాయని అన్నారు.

40 కోట్లుచెల్లిస్తారా?నియోజకవర్గ అభివృద్ధికి చావడానికైనా సిద్ధం

మంత్రుల సెగ్మెంట్లకే బిల్లులు మంజూరు

అవసరమైతే 30 వేల మందితో దీక్ష చేస్తా
జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



మహబూబ్ నగర్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

నియోజకవర్గంలో చేసిన, చేయా ల్సిన అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రభు త్వం నుంచి రూ.40కోట్లు రావాల్సి ఉంది. మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు చెల్లిస్తున్నారు. మరి ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటి?'.. అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. ఇవాళ ఆయన రాజాపూర్ మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. తమ గురువు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి రోడ్లు మం జూరు చేసి శంకుస్థాపనలు చేశారని, పనులు పూర్తి అయినా నేటి వరకూ బిల్లులు చెల్లించడం లేదన్నారు. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పాద యాత్ర చేస్తూ జడ్చర్లకు వచ్చినప్పుడు 40 వేల మందితో సభ నిర్వహించా నని గుర్తు చేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేసిన ఈ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడం లేదని, దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఓ కాంట్రాక్టర్ చనిపోతే అతనికి చెల్లించాల్సిన రూ.5 కోట్లు ప్రభుత్వం ఇచ్చేసిందని, 'నేను చనిపోతే రూ.40 కోట్లు చెల్లిస్తారా?.. నియోజకవర్గ అభివృద్ధికి చావడానికైనా సిద్ధమే' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే 30వేల మంది తో నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా పోరాడుదామని అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు.

"మాట హద్దు దాటితే తప్పు ..ఖర్చు హద్దు దాటితే అప్పు ఈ రెండు హద్దులు దాటితే ...మనశ్శాంతికే పెనుముప్పు."

ట్రైనెట్ న్యూస్ శశిమోహన కాంతి కిరణం...
(Part...1)



ముందుగా మాట హద్దు దాటితే తప్పు అన్న విషయాన్ని చర్చించుకుందాం....

మాట అనేది భగవంతుడు మానవాళికి ఇచ్చిన అత్యంత అద్భుతమైన మరియు గొప్ప వరం. సృష్టిలోని ఏ ఇతర జీవికీ లేని ఈ వాక్చాతుర్యం కేవలం మనిషికి మాత్రమే సొంతం. మాట ద్వారానే మనం మన ఆలోచనలను, భావాలను మరియు ప్రేమానురాగాలను ఇతరులతో పంచుకోగలుగుతున్నాం. బంధాలను కలపడనికి,పెంచటానికి మాట ఎంత కీలకమైన పాత్ర పోషిస్తుందో అదే విధంగా బంధాలను త్రెంచి వేయడంలో కూడా మాట అన్నది ప్రముఖ పాత్ర వహిస్తుంది.

మంచి మాటలు ఎదుటి మనిషిలో ధైర్యాన్ని సంతోషాన్ని నింపుతాయి. కానీ అనాలోచితంగా మాట్లాడిన మాటలు ఎదుట మనిషి హృదయాన్ని గాయపరుస్తాయి. .మనుషుల మధ్య ఉన్న బంధాలను కూడా దూరం చేస్తాయి. అందుకే మాట పదిలం అంటారు.

మాట ఇవ్వటం తేలిక కానీ ఆ మాటను నిలుపుకోవటం చాలా కష్టం. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం అంతకన్నా కష్టం. మాట నిలబెట్టుకోలేని చోట నమ్మకం విలువను పోగొట్టుకుంటుంది. సరైన సమాధానం చెప్పలేనప్పుడు మౌనంగా ఉండటమే మంచిది.

అందుకే మనం ఏ మాట మాట్లాడినా కొంచెం ఆలోచించుకొని మాట్లాడటం ఉత్తమం.

ఒక చిన్న తియ్యటి మాట రెండు మనసులను కలపడంలో ,విడిపోయిన బంధాలను తిరిగి కలపడంలో అద్భుతమైన శక్తిని కలిగి ఉంటుంది. మనసుకు తగిలిన గాయాలను మాన్పుతుంది. గాయపడ్డ హృదయానికి మంచి మాటలు స్వాంతన కూర్చుటమే కాక, కొత్త ఆశలను కూడా చిగురింప చేస్తాయి. ఒక నిజమైన నాయకుడి మాటలు వేలాది మందిలో స్ఫూర్తిని నింపుతాయి. ఆ మాటలు సమాజంలో విప్లవాత్మక మార్పులను తీసుకు రాగలవు. అదే మాట హద్దు మీరితే సమాజంలో మనకున్న గౌరవాన్ని ,ఒక్కోసారి కెరీర్ ని క్షణాల్లో బూడిద చేయగలదు. అందుకే పెద్దలు అంటారు "నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అని". ఇది సామెత కాదు. సకల జనులు ఆచరించదగ్గ కఠిన సత్యం. ఇంకొక సామెత కూడా ఉంది "కాలు జారినా తీసుకోవచ్చు మాట జారితే తీసుకోలేము" అని. ఈ సామెతలు కేవలం సొల్లు మాటలు కాదు.ఒకనాడు మన పెద్దలు అనుభవ సారాన్ని ఈ సామెతల రూపంలో సూక్తులుగా మనకి చెప్పారు.మాట జారటం జరిగితే గొడవలు రావడమే కాకుండా ఒక్కోసారి అవి హత్యలకు కూడా దారిచేస్తాయి ఎన్నో కాపురాలుఛిన్నాభిన్నం అవుతాయి. మాట జారిన తరువాత ఎంత విచారించినా ప్రయోజనం ఉండదు.

అందుకే ఎక్కడ ఎంత మాట్లాడాలో తెలుసుకోవాలి. మాట్లాడేటప్పుడు ఎదుట వారి మనోభావాలను గౌరవించాలి. నిజా నిజాలను తెలుసుకోకుండా ఎవరి వ్యక్తిత్వాన్ని గాయపరచకూడదు. సమయం, సందర్భం తెలియకుండా అనవసరమైన విషయాల్లో తలదూర్చి మాట్లాడకూడదు. ఈ విచక్షణ ఉన్నప్పుడు మాట ఎప్పటికీ హద్దు దాటదు తప్పుగా మారదు..

ఇది చాలా విస్తృతమైన అంశం కనుక మిగతాది రేపు చర్చించుకుందాం.

శుభోదయం..... శశిబాల

మార్చాల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని మార్చాల గ్రామంలోని, ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించి, పాఠశాల వాతావరణాన్ని పరిశీలించి, అక్కడి విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ ఖీచీ కార్యక్రమం అమలు తీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలలో మొత్తం ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధతో బోధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా 54 మంది విద్యార్థులు పాఠశాలలో చేరడంతో, ప్రస్తుతం మొత్తం 106 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. అలాగే, ఈ పాఠశాలలో చదివిన ఆరుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందినట్లు వివరించారు. స్థానిక పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుండటంతో విద్యార్థులు ఇక్కడే చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని, విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు ఆకుకూరలను కిచెన్ గార్డెన్ ద్వారా పండించిన ఆకుకూరలను ఉపయోగిస్తున్నట్లు, దాతల సహకారంతో విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకునేందుకు సహకారంతో షెడ్‌ను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ కలెక్టర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా పాఠశాల విద్యా వాతావరణాన్ని, విద్యార్థుల అభ్యసన పురోగతిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ వెంట సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,, ఎమ్మార్వో ఇబ్రహీం, ఎంపీడీవో యాదయ్య, మార్చాలా పంచాయతీ సెక్రెటరీ రమేష్, ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.23 లక్షలతో ఎస్సారెస్పీ కాలువ అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్.

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామం వద్ద ఎస్సారె-స్పీ డీబీఎం-48 మైనర్ కాలువపై రూ.23 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ ప్రారంభించారు. సుమారు 37 కిలోమీటర్ల పొడవున కాలువలో పెరిగిన చెట్ల తొలగింపు, పూడికతీత పనులను చేపట్టనున్నారు.

ఈ పనుల ద్వారా కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగి, సాగునీరు సక్రమంగా ప్రవహించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కాలువ నిర్వహణ పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సంబంధిత



అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారి వెంట ఇరిగేషన్ శాఖ అధికారులు,వీరితో పాటు ఆలేరు గ్రామ



సర్పంచ్ నాయిని పద్మ సత్యపాల్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి,ఇనుగుర్తి మండల పార్టీ అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్,వివిధ గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచులు ,మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసుల తనిఖీలు.



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

మహబూబాబాద్ పట్టణంలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడంలో భాగంగా మహబూబాబాద్ సీఐ రఘునందన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు, ఇతర జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీలలో భాగంగా ఆధునిక ఫింగర్ ప్రింట్ పరికరాన్ని ఉపయోగించి అనుమానాస్పద వ్యక్తుల వివరాలను పరిశీలించారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, వారి ప్రస్తుత కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే దిశగా చర్యలు చేపట్టారు.

బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, జేబుదొంగతనాలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను గుర్తించి, అవసరమైన మేరకు వారి వివరాలను సేకరించి, చట్ట ప్రకారం పరిశీలిస్తున్నారు.

గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు తిరిగి నేరాలకు పాల్పడకుండా నిరోధించడం, నేరాల ప్రణాళికలను ముందుగానే గుర్తించడం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.

ప్రజలు తమ చుట్టుపక్కల అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతో నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఐ పేర్కొన్నారు.

తీదేడు విజినరీ గ్రీన్ ఎస్టేట్‌పై సమగ్ర విచారణ జరపాలి



- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఉపసర్పంచ్ ఈడబోయిన వెంకటయ్య యాదవ్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని సర్వే నంబర్ 390లో ఉన్న విజినరీ గ్రీన్ ఎస్టేట్ వెంచర్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తీదేడు గ్రామ ఉపసర్పంచ్ ఈడబోయిన వెంకటయ్య యాదవ్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

208 ప్లాట్ల ఏర్పాటు.. 28 ప్లాట్ల విక్రయాలపై ఆరా తీయాలి

సదరు భూమిలో మొత్తం 208 ప్లాట్లు ఏర్పాటు చేసినట్లు, వాటిలో 28 ప్లాట్లను ఆన్‌లైన్ ద్వారా విక్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫామ్‌ల్యాండ్ పేరుతో జరుగుతున్న ఈ విక్రయాలకు సంబంధించి భూమి స్వరూపం, భూ వినియోగ మార్పిడి, లేఅవుట్ ఆమోదాలు, ఇతర అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.

ఫామ్‌ల్యాండ్ పేరుతో విక్రయాలు.. అధికారుల పర్యవేక్షణ ఏది?

వ్యవసాయ భూములను ఫామ్‌ల్యాండ్ పేరుతో ప్లాట్లుగా విభజించి విక్రయించే వ్యవహారాల్లో వర్తించే చట్టాలు, అనుమతులు, నిబంధనలను సంబంధిత



శాఖలు క్షుణ్ణంగా పరిశీలించాలి. సర్వే నంబర్ 390లోని భూమికి అవసరమైన అనుమతులు పొందారా? ప్లాట్ల ఏర్పాటు, విక్రయాలు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా? అనే అంశాలను రెవెన్యూ, ప్రణాళికా విభాగాల అధికారులు పరిశీలించాలని ఉపసర్పంచ్ కోరారు.

వెంచర్‌పై ఫిర్యాదు అందిన నేపథ్యంలో అధికారులు కేవలం పత్రాల పరిశీలనకే పరిమితం కాకుండా, అవసరమైతే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి


ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజలు తమ కష్టార్జిత డబ్బును పెట్టుబడిగా పెడుతున్నందున, భూమికి సంబంధించిన అనుమతులు, రికార్డులపై పూర్తి స్పష్టత ఉండాలని వెంకటయ్య యాదవ్ పేర్కొన్నారు. విచారణలో నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే సంబంధిత బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ ఈ ఫిర్యాదుపై స్పందించి సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ జరిపించి నివేదిక తెప్పించాలని, వాస్తవాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టాలని ఉపసర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల కోడ్ ఎఫెక్ట్.. 15 మంది పాత నేరస్తుల బైండోవర్



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు నిఘా ముమ్మరం చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. కొండారెడ్డి పర్యవేక్షణలో కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల్లో గతంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన 15 మంది పాత నేరస్తులను ఆయా మండలాల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు.వీరిలో కంభం మండలానికి చెందిన ఐదుగురు, బేస్తవారిపేట మండలానికి చెందిన ఆరుగురు, అర్ధవీడు మండలానికి చెందిన నలుగురు ఉన్నారు. వీరిని



రెండేళ్ల కాలపరిమితికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేసినట్లు అధికారులు తెలిపారు.ఎన్నికల సమయంలో అక్రమ మద్యం రవాణా, నిల్వలు, విక్రయాలు, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. కొండారెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బాండ్ మొత్తాన్ని జప్తు చేసే అవకాశం ఉందన్నారు. శాంతియుతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని, అక్రమ మద్యం కార్యకలాపాలు గుర్తిస్తే ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించాలని కోరారు.

అక్టోబర్ 27 నుంచి రైల్వే టికెట్ కౌంటర్లలోనూ ప్రయాణ బీమా.

0.45 పైసలకే ఐచ్ఛిక బీమా.. గరిష్ఠంగా రూ.10 లక్షల పరిహారం.

తిరుపతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

భారతీయ రైల్వేలు అక్టోబర్ 27 నుంచి రిజర్వేషన్ కౌంటర్లలో టికెట్లు కొనుగోలు చేసే ప్రయాణికులకు కూడా ఐచ్ఛిక ప్రయాణ బీమా సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నాయి. ఇప్పటివరకు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌కే పరిమితమైన ఈ సదుపాయం ఇకపై కౌంటర్లలోనూ లభించనుంది.

బీమా పొందాలనుకునే ప్రయాణికులు తమ మొబైల్ నంబర్‌ను అందించి, టికెట్ ఛార్జీతో పాటు ప్రీమియంను డిజిటల్‌గా చెల్లించాలి. పన్నులతో కలిపి ఒక్కో ప్రయాణికుడికి ప్రీమియం 45 పైసలు. బీమా పూర్తిగా ఐచ్ఛికం. ఈ బీమా కింద రైలు ప్రయాణంలో మరణం లేదా శాశ్వత పూర్తి వైకల్యానికి రూ. 10 లక్షల వరకు, పాక్షిక శాశ్వత వైకల్యానికి రూ. 7.5 లక్షల వరకు, గాయాల చికిత్సకు రూ. 2 లక్షల వరకు పరిహారం లభిస్తుంది. మృతదేహం తరలింపునకు రూ. 10,000 వరకు చెల్లిస్తారు.



ఈ సదుపాయం అమలును రైల్వే ఉన్నతాధికారులు పర్యవేక్షించనుండగా, సీఆర్ఐఎస్ , ఐఆర్సీటీసీ సాంకేతిక సహకారం అందించనున్నాయి.ం

మహిళల ప్రయాణాల్లో తెలంగాణ టాప్



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో రాష్ట్రం లో మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరిగాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ పథకం మహిళల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్వయం ప్రతిపత్తికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. మహిళల సాధికారతకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఈ గణాంకాలు నిదర్శనమని ఎక్స్ వేదికగా వెల్లడించారు. జాతీయ గణాంక కార్యాలయం నిర్వహించిన ఆల్ ఇండియా టైమ్ యూజ్ సర్వే ప్రకారం.. తెలంగాణలో 15 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళల్లో రోజూ కనీసం ఒక్క సారైనా బయటకు ప్రయాణించే వారి శాతం 2019లో 43.7గా ఉండగా, 2024 నాటికి 54.6 శాతానికి పెరిగింది. ఐదేళ్లలో 10.9 శాతం పాయింట్ల వృద్ధి నమోదైంది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలవుతున్న తమిళనాడులో 6.7, కర్ణాటకలో 5, పంజాబ్లో 4.1 శాతం పాయింట్ల వృద్ధి నమోదైంది. ప్రస్తుతం రోజుకు సుమారు 37 లక్షల మంది మహిళలు టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.

ఏపీ కి కేంద్రం భారీ సాయం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం భారీ సాయం అందించింది. ఏపీలో రూ.27,370 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న భారీ విద్యుత్ ప్రసార ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడమే లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ కారిడార్-3కు ఆమోదించింది. ఏపీలో గ్రీన్ ఎనర్జీ రంగానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కార్ ఊతమిచ్చింది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని విస్తరించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ (GEC-III) కింద ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది.లైన్లు, రామాయపట్నం, కొప్పాకలలో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో విద్యుత్ ప్రసార వ్యవస్థ ఆధునికీకరణకు మోదీ సర్కార్ ఆమోదం తెలిపింది. రూ. 27,370 కోట్ల విలువైన ప్రాజెక్టుకు ఆమోదించింది. 9,500 ఎంవీఏ సామర్థ్యంతో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగనుంది. 2029-30 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రణాళికలను కేంద్రం రచించింది. ఏపీలోని పోర్టు ప్రాంతాలు, పారిశ్రామిక క్లస్టర్లకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రామాయపట్నంలో 400 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

డ్రగ్స్ పై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



గచ్చిబౌలిలో డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు ఈరోజు (సోమవారం) ఆకస్మిక దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో ఎల్‌బీఎస్ నగర్‌లో ఇంటి నుంచే గంజాయి విక్రయిస్తున్న 75 ఏళ్ల షేక్ జాతెన్ బీని అరెస్ట్ చేశారు. నిందితురాలి ఇంట్లో 41 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమె దగ్గరి నుంచి మొత్తం 179.1 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. ఈ ఆపరేషన్‌లో 70 మంది గంజాయి వినియోగదారులను గుర్తించారు. 66 మందికి వైద్య పరీక్షలు జరపగా.. ఈ పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లుగా పాజిటివ్‌గా నిర్ధారించారు. గంజాయి వినియోగదారుల్లో ముగ్గురు బాలురని, మరో 65 మందిని పునరావాస కేంద్రాలకు ఈగల్ అధికారులు తరలించారు. అలాగే, గాంధీ రిహాబిలిటేషన్ సెంటర్‌కు 45 మందిని, ఆమనగల్ కేంద్రానికి 15 మంది, కొత్తూరు కేంద్రానికి ఐదుగురిని తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సరఫరా మూలాలు, ఇతర వ్యక్తుల పాత్రపై ఈగల్ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలు షేక్ జాతెన్ బీపై గతంలో మరో ఏడు కేసులు ఉన్నట్లు గుర్తించారు.

స్వదేశీ గ్రీన్ ప్రొపల్షన్ టెక్నాలజీకి రూ.116 కోట్ల ఆర్థిక మద్దతు మనస్తు స్పేస్‌తో టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు ఒప్పందం రూ.277.63 కోట్లతో ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాల కోసం అధునాతన చోదక వ్యవస్థల అభివృద్ధి

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:



స్వదేశీ అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేస్తూ,పర్యావరణ అనుకూల చోదక వ్యవస్థల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మద్దతు అందిస్తోంది. మహారాష్ట్రలోని నవీ ముంబైకి చెందిన మనస్తు స్పేస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కేంద్ర శాస్త్ర--సాంకేతికశాఖపరిధిలోనిటెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు (టీడీబీ) ఒప్పందం కుదుర్చుకుంది. పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల (ఆర్‌డీఐ) నిధి కింద సంస్థకు రూ.116 కోట్ల ఆర్థిక సహాయం అందించనుంది.మొత్తం రూ.277.63 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాల కోసం అధిక పనితీరు, తక్కువ వ్యయంతో కూడిన సమగ్ర గ్రీన్ ప్రొపల్షన్ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. ఐదు మిల్లీన్యూటన్ల నుంచి 300 న్యూటన్ల వరకు థ్రస్ట్ అవసరాలకు అనుగుణంగా దీనిని రూపొందించనున్నారు. ప్రస్తుత సాంకేతిక సంసిద్ధత స్థాయి టీఆర్ఎల్--6లో ఉన్న పరిజ్ఞానాన్ని, పూర్తిస్థాయి వినియోగానికి సిద్ధమైన టీఆర్ఎల్--9కు తీసుకెళ్లడం లక్ష్యం. ఈ ఆర్థిక మద్దతును నిర్దిష్ట నిబంధనల మేరకు వాటాలుగా మార్చుకునే అవకాశం ఉన్న రుణం రూపంలో అందించనున్నారు.

మనస్తు స్పేస్ అభివృద్ధి చేస్తున్న వ్యవస్థలో ప్రత్యేక సంకలితాలతో కూడిన హైడ్రోజన్ పెరాక్సైడ్ ఆధారిత పర్యావరణ అనుకూల ప్రొపెల్లెంట్‌ను వినియోగిస్తున్నారు. దీనికి అనుసంధానంగా ఇంజిన్, ఉత్ప్రేరక వ్యవస్థ పనిచేస్తాయి. సంప్రదాయ ప్రొపెల్లెంట్ల వినియోగంలో ఎదురయ్యే నిర్వహణ సవాళ్లను తగ్గించడంతో పాటు పనితీరు, వ్యయ సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ సాంకేతికత ప్రత్యేకత.చిన్న ఉపగ్రహాల నుంచి అధిక చోదక శక్తి అవసరమయ్యే వ్యవస్థల వరకు ఉపయోగించుకునేలా దీనిని విస్తరించవచ్చు. ప్రాజెక్టులో భాగంగా చోదక ఇంజిన్లు, ప్రొపెల్లెంట్ సరఫరా వ్యవస్థలతో పాటు అత్యంత అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే సిరామిక్ ఉత్ప్రేరకాన్ని అభివృద్ధి చేయనున్నారు.

ఈ చోదక సాంకేతికతను ఇప్పటికే అంతరిక్షంలో ప్రదర్శించారు. తదుపరి ఇంజినీరింగ్ అభివృద్ధి, వ్యవస్థల అనుసంధానం, పరీక్షలు, ధ్రువీకరణ ద్వారా దీని విశ్వసనీయతను పెంచి విస్తృత వినియోగానికి సిద్ధం చేయనున్నారు. అంతరిక్ష ప్రయోగాల భద్రత, వ్యయ సామర్థ్యాన్ని మెరుగుపరచడంతో పాటు విదేశీ సాంకేతికతపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం లక్ష్యం.

స్వదేశీ చోదక సాంకేతికతలు భారత అంతరిక్ష రంగ సామర్థ్యాల బలోపేతానికి కీలకమని టీడీబీ కార్యదర్శి రాజేష్‌కుమార్ పాఠక్ పేర్కొన్నారు. అధునాతన అభివృద్ధి దశ నుంచి వినియోగ దశకు చేరేందుకు నిరంతర పెట్టుబడులు అవసరమయ్యే సాంకేతిక కార్యక్రమాలకు ఆర్‌డీఐ నిధి ద్వారా మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

టీడీబీ సహకారంతో తమ గ్రీన్ ప్రొపల్షన్ సాంకేతికత అభివృద్ధి, అనుసంధానం, ధ్రువీకరణను వేగవంతం చేస్తామని మనస్తు స్పేస్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ పేర్కొన్నారు. మెరుగైన పనితీరు, విశ్వసనీయత, తక్కువ వ్యయంతో కూడిన సురక్షిత చోదక వ్యవస్థను రూపొందించి, భారత స్వదేశీ అంతరిక్ష సామర్థ్యాలను పెంచేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని తెలిపారు.

ఎగుమతిదారులకు ఊరట.. 'రిలీఫ్' గడువు పొడిగింపు

2027 మార్చి 31 వరకు రెండో విభాగం అమలు.. అర్హతగల ఎగుమతులకు 95 శాతం రిస్క్ కవరేజీ

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, గల్ఫ్ పరిసర ప్రాంతాల్లో సముద్ర రవాణాకు ఎదురవుతున్న అంతరాయాల నేపథ్యంలో ఎగుమతిదారులకు కేంద్ర వాణిజ్య శాఖ ఊరట కల్పించింది. ఎగుమతి ప్రోత్సాహక మిషన్ పరిధిలోని 'రిలీఫ్' కార్యక్రమం రెండో విభాగం గడువును 2027 మార్చి 31 వరకు పొడిగించింది. ఈ మేరకు సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ నంబర్ 37/2026--27 జారీ చేసింది.

నిర్దేశిత ప్రాంతాలకు చేపట్టే రాబోయే ఎగుమతులకు ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీజీసీ) బీమా రక్షణ పొందేలా ప్రోత్సహించడం ఈ విభాగం లక్ష్యం. ఇందులో 95 శాతం రిస్క్ కవరేజీ కల్పిస్తారు. 2026 మార్చి 16న లేదా ఆ తర్వాత తీసుకున్న స్టాండలోన్, హోల్ టర్నోవర్ పాలసీలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. అర్హత కాలంలో పూర్తి కంటెయినర్ లోడ్ (ఎఫ్‌సీఎల్), పాక్షిక కంటెయినర్ లోడ్ (ఎల్‌సీఎల్), శీతలీకరణ సదుపాయం ఉన్న రీఫర్ కంటెయినర్లలో రవాణా చేసే సరుకులకు ఈ పథకం వర్తిస్తుంది. ఇంధన రవాణాకు మాత్రం వర్తించదు.

ప్రయోజనం పొందాలనుకునే ఎగుమతిదారులు ఈసీజీసీ వెబ్‌సైట్‌లోని కస్టమర్ పోర్టల్ ద్వారా క్లెయిమ్‌లు, సంబంధిత పత్రాలను సమర్పించాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందడం, ఎగుమతిదారుల నమోదు, క్లెయిమ్‌ల సమర్పణపై ఈసీజీసీ అధికారిక యూట్యూబ్ చానల్ '@ecgcltd7016'లో వీడియో మార్గదర్శకాలు అందుబాటులో ఉన్నాయి.

గల్ఫ్, విస్తృత పశ్చిమాసియా సముద్ర మార్గాల్లో అంతరాయాలతో పెరిగిన సరుకు రవాణా వ్యయాలు, బీమా ప్రీమియంలు, యుద్ధ సంబంధిత ఎగుమతి నష్టభయాలను ఎదుర్కొనేందుకు 2026 మార్చి 19న 'రిలీఫ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాజా పొడిగింపు ద్వారా వాణిజ్య ప్రవాహాలు కొనసాగేందుకు, అనిశ్చిత పరిస్థితుల్లో భారత ఎగుమతిదారులకు మద్దతు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

తెలంగాణ ఆరోగ్య శాఖ అప్రమత్తం!

107 ఆసుపత్రుల్లో జనరేటర్ల ఏర్పాటు.. రూ.21.96 కోట్ల నిధులు విడుదల





హైదరాబాద్, అక్టోబర్ 26(జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారిస్తోంది. ఆసుపత్రుల్లో విద్యుత్ సరఫరా అంతరాయాలు, నీటి కొరత కారణంగా రోగులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ప్రాధాన్యతగా మారింది. ఈ క్రమంలో ఎల్ఎన్ఓ పర్యవేక్షణతో పాటు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

జనరేటర్ల కొనుగోలుకు రూ.21.96 కోట్లు

2025 జూలై 3న జనరేటర్ల కొనుగోలుకు రూ.21.96 కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 107 ఆసుపత్రుల్లో విద్యుత్ బ్యాకప్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఈ మేరకు తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) డీజిల్ జనరేటర్ల కొనుగోలుకు టెండర్లు పిలిచింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సందర్భాల్లో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా జనరేటర్లు ఉపయోగపడనున్నాయి.

ఆసుపత్రుల్లో నీటి సమస్యకు పరిష్కారం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నీటి కొరత వల్ల రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోకుండా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. పెద్ద సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకులను ఏర్పాటు చేయడం ద్వారా నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఆసుపత్రుల అవసరాలను తీర్చేందుకు అవకాశం ఉంటుంది.

ఎల్ఎన్ఓ పర్యవేక్షణతో ముందస్తు చర్యలు

ఆసుపత్రుల్లో విద్యుత్, నీటి సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టడం కీలకం. జనరేటర్లు సక్రమంగా పనిచేస్తున్నాయా? నీటి ట్యాంకుల్లో తగినంత నిల్వ ఉందా? అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలను నిరంతరం పరిశీలించాల్సిన అవసరం ఉంది.

రోగుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

నిధుల విడుదల, టెండర్ల ప్రక్రియతోపాటు జనరేటర్ల ఏర్పాటు, నీటి ట్యాంకుల నిర్మాణం లేదా సామర్థ్య పెంపు పనులు నిర్ణీత సమయంలో పూర్తిచేయడం ముఖ్యం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడితే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

ఆసుపత్రుల్లో విద్యుత్, నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ రోగులకు నిరంతర వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..

12

మంగళవారం , అక్టోబర్,27, 2026
www.trinetnews.com

అడవి బాపి రాజు యాది లో





హైదారాబాద్, చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 26:

శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా బహుముఖీన సాహితీ వేత్త అడవి బాపి రాజు యాది లో పేరిట ఆయన జయంతి కార్యక్రమం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు మాట్లాడుతూ అడవి బాపి రాజు నాడు రాసిన చారిత్రక నవలలు ప్రసిద్ధి పొందాయి అని చెప్పారు ఆయన గీత రచయిత గనే కాక చిత్ర కారుడు గా కూడా గుర్తింపు పొందిన ప్రజ్ఞా నిధి అన్నారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై సాహితీ వేత్త డాక్టర్ జయ రాములు గాయని అక్కిరాజు యోగిత మిమిక్రీ కళా కారుడు భవిరి శివ పాల్గొన్నారు

ఆదీ మహోత్సవ్‌లో గిరిజన కళా వైభవం.. దేశవ్యాప్తంగా హస్తకళలకు ప్రోత్సాహం

గిరిజన చిత్రకళలు, వెదురు ఉత్పత్తులు, చేనేత వస్త్రాలకు ప్రత్యేకఆకర్షణ

నవీ ముంబై: ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 26:

భారతదేశ గిరిజన సంస్కృతి, సంప్రదాయ కళలు, హస్తకళలను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఆదీ మహోత్సవ్--2026 అక్టోబర్ 23న సిడ్కో అర్బన్ హాట్, బెలాపూర్‌లో ప్రారంభమైంది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ట్రైఫెడ్ నిర్వహిస్తున్న ఈ ఎనిమిది రోజుల ఉత్సవం అక్టోబర్ 30 వరకు కొనసాగనుంది.

దేశంలోని వివిధ ప్రాంతాల గిరిజన కళాకారులు తయారు చేసిన సంప్రదాయ హస్తకళలు, చేనేత వస్త్రాలు, ఆభరణాలు, గిరిజన చిత్రాలు, వెదురు--చెరకు ఉత్పత్తులు, లోహపు కళాఖండాలు ప్రదర్శనకు ఉంచారు. అటవీ ఉత్పత్తులతో తయారు చేసిన విలువ ఆధారిత వస్తువులకు కూడా ఈ మేళాలో స్థానం కల్పించారు.

ప్రారంభ వేడుకలో మహారాష్ట్రలోని పాల్ఘర్ ప్రాంతానికి చెందిన గిరిజన కళాకారుల తార్పా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ వాయిద్యాల తాళానికి కళాకారులు చేసిన ప్రదర్శన గిరిజన జీవనశైలి, ప్రకృతితో వారి అనుబంధాన్ని ప్రతిబింబించింది.



గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న చేతివృత్తులకు సరైన మార్కెట్ కల్పించడం ఈ ఉత్సవం ప్రధాన లక్ష్యం. కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు అవకాశం లభిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘాలు, గిరిజన ఉత్పత్తిదారుల బృందాలకు కూడా తమ వస్తువులను విస్తృత మార్కెట్‌కు పరిచయం చేసే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోంది.

సంప్రదాయ కళలను కాపాడుతూ వాటి ద్వారా జీవనోపాధిని పెంపొందించడం, స్థానిక ఉత్పత్తులకు గుర్తింపు తీసుకురావడం వంటి లక్ష్యాలతో ఆదీ మహోత్సవ్ నిర్వహిస్తున్నారు.

కళాకారులకు మార్కెట్.. గిరిజన కుటుంబాలకు ఉపాధి

విజయవాడలో కలాదర్శిని కళా ఉత్సవాలు ప్రారంభం.. విద్యార్థుల ప్రతిభకు వేదిక



విజయవాడ। నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, నాటికల్లో పోటీలు

విజయవాడ:ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 26:

విద్యార్థులు, ఔత్సాహిక కళాకారుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్రా లయోలా కళాశాలలో 23వ కలాదర్శిని సాంస్కృతిక ఉత్సవాలు అక్టోబర్ 26న ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 31 వరకు ఆరు రోజులపాటు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. కలాదర్శిని ఫైన్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ కళా విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.

భరతనాట్యం, కూచిపూడి ఏకల నృత్యాలు, శాస్త్రీయ గానం, లలిత సంగీతం, సమూహ గానం, చిత్రలేఖనం, నాటికలు, పాశ్చాత్య నృత్యాలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు వేర్వేరు విభాగాల్లో పాల్గొనే అవకాశం కల్పించారు.

బాల్యంలోనే కళలపై ఆసక్తి పెంపొందించాలి

విద్యతో పాటు కళలు కూడా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో కీలక పాత్ర పోషిస్తాయి. సంగీతం ఏకాగ్రతను పెంపొందించగా, నృత్యం శారీరక చురుకుదనంతో పాటు భావవ్యక్తీకరణకు తోడ్పడుతుంది. చిత్రలేఖనం, నాటకాలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందిస్తాయి.

యువ కళాకారులకు వేదికలు కల్పించడం ద్వారా వారి ప్రతిభను గుర్తించి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదిగేలా ప్రోత్సహించవచ్చు. ఇటువంటి ఉత్సవాలు సంప్రదాయ కళల పరిరక్షణతో పాటు ఆధునిక కళారూపాలకు కూడా ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి.





దేశీయ కళాకారులకు అండగా జెమ్ 'ఆభార్ కలెక్షన్'

10 చేనేత, హస్తకళల ఎంపోరియంల నుంచి 294 ఉత్పత్తుల జాబితాలు

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే బహుమతులు,గిఫ్ట్‌హ్యాంపర్లనుప్రభుత్వకొనుగోలుదారులకు చేరువ చేసేందుకు గవర్నమెంట్ ఈ--మార్కెట్‌ప్లేస్ (జెమ్) 'ది ఆభార్ కలెక్షన్'ను ప్రోత్సహిస్తోంది. ప్రత్యేక డిజిటల్ విక్రయ వేదికగా రూపొందించినఈ కలెక్షన్ ద్వారా హస్తకళాకారులు, చేనేత కార్మికులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, మహిళల ఆధ్వర్యంలోని సంస్థలకు మార్కెట్ అవకాశాలు కల్పిస్తోంది.

'ఒక జిల్లా--ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) కార్యక్రమంతో అనుబంధమున్న ఉత్పత్తులు, భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన వస్తువులకు ఇందులో చోటు కల్పించారు. ప్రస్తుతం 10 కేంద్ర, రాష్ట్ర చేనేత--హస్తకళల ఎంపోరియంలకు చెందిన 294 ఉత్పత్తుల కేటలాగ్ జాబితాలు అందుబాటులో ఉన్నాయి. సెంట్రల్‌కాటేజ్‌ఇండస్ట్రీస్ ఎంపోరియంకు చెందిన 'కాటేజ్', ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్‌కు చెందిన 'ఖాదీ ఇండియా'తోపాటు గుజరాత్‌కు చెందిన గర్వీ గుర్జరీ, హిమాచల్‌ప్రదేశ్ హిమ్‌క్రాఫ్ట్స్, జార్ఖండ్ ఝార్‌క్రాఫ్ట్, కర్ణాటక కావేరి, మధ్యప్రదేశ్ మృగనయని, మహారాష్ట్ర మరాఠీ, ఈశాన్య ప్రాంత పూర్బశ్రీ, తమిళనాడు పూంపుహార్ ఉత్పత్తులు ఈ కలెక్షన్‌లో ఉన్నాయి.



మరో ఏడు ప్రభుత్వ ఎంపోరియంలు, సంస్థలను విక్రేతలుగా నమోదు చేసే ప్రక్రియ తుది దశలో ఉంది. కాఫీ బోర్డు, పశ్చిమబెంగాల్‌కు చెందిన మంజూషా, బిశ్వ బంగ్లా, జమ్మూకశ్మీర్ హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ మార్కెటింగ్ కార్పొరేషన్, నాగాలాండ్ మెరకై, ఒడిశా ఉత్కళిక, మణిపూర్ పాంథోయిబి ఇందులో చేరనున్నాయి. వీటి చేరికతో మరిన్ని ప్రాంతీయ ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి.

హస్తకళలు, చేనేత వస్త్రాలు, సంప్రదాయ ఆహార పదార్థాలు, వంటింటి అవసరాల ఉత్పత్తులు, వ్యక్తిగత సంరక్షణ వస్తువులు ఈ కలెక్షన్‌లో లభిస్తాయి. అధికారిక వేడుకలు, సదస్సులు, విదేశీ ప్రతినిధి బృందాల పర్యటనలు, ఉద్యోగుల సన్మానాలు, పదవీ విరమణ కార్యక్రమాలు, పండుగల సందర్భంగా అందించే బహుమతుల కోసం ప్రభుత్వ సంస్థలు వీటిని కొనుగోలు చేయవచ్చు.

దేశీయ కళలకు గుర్తింపు పెంచడంతోపాటు తగిన మార్కెట్ అవకాశాలు అందని విక్రేత వర్గాలకు సాధికారత కల్పించడంలో ఆభార్ కలెక్షన్ కీలక ముందడుగని జెమ్ సీఈఓ మిహిర్ కుమార్ పేర్కొన్నారు. దేశంలోని కళాకారుల ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోళ్ల వ్యవస్థతో అనుసంధానించాలనే ఉద్దేశంతో 2024 జూలైలో ఈ వేదికను ప్రారంభించినట్లు జెమ్ అదనపు సీఈఓ అజిత్ బి. చవాన్ తెలిపారు. మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వరంగ సంస్థలు తమ బహుమతుల అవసరాలను తీర్చుకుంటూనే స్థానిక ఉత్పత్తులు, జీవనోపాధులకు మద్దతు ఇవ్వవచ్చని వివరించారు.

నాట్య గురువు ను సన్మానిస్తున్న కోలేటి దామోదర్ గుప్తా

శాస్త్రీయ గుర్తింపు తెచ్చిన మహానుభావులలో పద్మ భూషణ్ వెంపటి చినసత్యం ప్రథముడు
-కోలేటి దామోదర్ గుప్తా



హైదారాబాద్,రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్,

అక్టోబర్ 25: కూచిపూడి నృత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేసి, దానికి శాస్త్రీయ గుర్తింపు తెచ్చిన మహానుభావులలో పద్మ భూషణ్ వెంపటి చినసత్యం ప్రథములని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రసిద్ధ కూచిపూడి నాట్యాచార్యులు పద్మభూషణ్ వెంపటి చిన సత్యం 87వ జయంతి పురస్కరించుకుని రవీంద్రభారతిలో సిరిసిరిమువ్వలు







-7 పేరిట సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్ గుప్తా, గౌరవ అతిథులుగా నాట్య గురువు లు చలపతి శాస్త్రి, డా. ప్రసన్న రాణి, ప్రసాద్, ప్రశాంతి పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి వెంపటి చిన్న సత్యం కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోలేటి దామోదర్ గుప్తా మాట్లాడుతూ, నాట్యశాస్త్ర నిబంధనలను కూచిపూడికి జోడించి, నృత్య రూపకాలను పునరుద్ధరించిన మహానీయులు వెంపటి చినసత్యం అని ఆయన గుర్తుచేశారు. కూచిపూడి నాట్యంలో సరికొత్త ప్రయోగాలు చేయడానికి తన జీవితమంతా అంకితం చేసిన విదుషీధీమణి వెంపటి చిన సత్యం అని కోలేటి కొనియాడారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి

శ్రీవారిని దర్శించుకున్న భారత ఉప రాష్ట్రపతి









తిరుమల, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:

భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.ముందుగా క్షేత్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ ఉప రాష్ట్రపతి శ్రీ వరాహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు ఉప రాష్ట్రపతి చేరుకోగానే టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణలు ఆయనను సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. తరువాత ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అటు పిమ్మట వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. భారత ఉపరాష్ట్రపతికి టీటీడీ ఈవో, అదనపు ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. ఉప రాష్ట్రపతి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి వారిని కూడా అనంతరం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, టిటిడి బోర్డు సభ్యులు రామ్మూర్తి, దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, పలువురు రాష్ట్రస్థాయి మరియు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA.
www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136